https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 101 | కర్నూలు | శనివారం 23-05-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi





మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్.



# 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీ

## అటవీశాఖకు టార్గెట్ విధించిన డిప్యూటీ సిఎం



అమరావతి,మే22(శ్రీచక్ర) :అటవీ శాఖ ఆధ్వర్యంలో 2.5 కోట్ల విత్తన బంతులను పంపిణీ చేయాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. వీటి తయారీ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని అన్నారు. అందుకు అన్ని వర్గాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖపై పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ నెలలో నిర్వహించనున్న విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమంపై అధికారులకు ఆయన దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాకాల సీజన్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా విత్తన బంతులను విస్తారంగా చల్లడానికి అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఇందుకోసం మూడు రకాల ప్రత్యేక పద్ధతులను ఉపయోగించాలని సూచించారు. నేరుగా చల్లడం, అత్యాధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించడం, చేతులతో నాటడం చేయాలని ఆయన పేర్కొన్నారు. అడవుల్లో జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం, స్వచ్ఛమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం ఈ హరిత ఉద్యమ ప్రధాన లక్ష్యమని పవన్ చెప్పుకొచ్చారు. విత్తనం చల్లే ప్రతి విత్తన బంతి.. మన భవిష్యత్తుకు ఇచ్చే ఒక నమ్మకమైన హామీగా మారాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే తరాల కోసం ఆంధ్రప్రదేశ్‌ను మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా, సుస్థిరంగా మార్చేందుకు మనమంతా చేతులు కలపాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్రలు చేశారు: మంత్రి లోకేశ్..



అమరావతి:(శ్రీచక్ర) ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అద్భుత నటుడని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సినిమాల్లో నటిస్తే జగన్‌కు కచ్చితంగా ఆస్కార్ అవార్డ్ వస్తుందని ఎద్దేవా చేశారు. ఆస్తి కోసం సొంత తల్లి, చెల్లిని బయటకు గెంటేశారని.. ఇంకో చెల్లి తండ్రిని చంపి అన్యాయం చేశారంటూ మంత్రి ఆరోపించారు. సొంత జిల్లా ప్రజలను మోసం చేశారని.. సొంత బాబాయిని లేపేసి నెపం టీడీపీపై నెట్టారని మండిపడ్డారు. వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో లోకేశ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. వైఎస్ వివేకాది గుండెపోటు కాదని.. గొడ్డలి పోటు అంటూ ఆరోపణలు గుప్పించారు. గతంలో జగన్ కోడికత్తి, గులకరాయి డ్రామాలు చూశామని.. మొన్న కడపలోనూ అలాంటి కుట్రే జరిగిందన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూశారని.. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టేది లేదని మంత్రి లోకేశ్ హెచ్చరించారు. రప్పా, రప్పా అంటే భయపడేవారు ఎవరూ లేరని.. మీ నాయకుడిని, వారి తండ్రినీ చూశామని వైసీపీ కార్యకర్తలకు చురకలు అంటించారు. రప్పా, రప్పాకు ఎండ్ కార్డ్ వేసే బాధ్యత తనదంటూ మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు. రెడ్ బుక్ అంటేనే భయపడుతున్నారని.. చివరకు ఎర్ర కారు చూసినా బెదిరిపోతున్నారని వైసీపీ నేతలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ రెడ్డి వారంలో ఒక రోజు మాత్రమే ఏపీలో ఉంటున్నారని.. మూడు రోజులు బెంగళూరులో, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో ఉంటున్నారని లోకేశ్ తెలిపారు. జగన్‌కు సీసీడీ (క్రెడిట్ చోరీ డిజార్డర్) వ్యాధి ఉందని.. వైసీపీ కుట్రలపై అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా గండికోట నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. రాబోయే రోజుల్లో జమ్మలమడుగుకు అనేక పరిశ్రమలు వస్తాయని తెలిపారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను 2029 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కష్టకాలంలో పసుపుజెండాకు అండగా నిలబడిన వ్యక్తి భూపేశ్ రెడ్డి అని మంత్రి ప్రశంసించారు. ఆయనకు మాటలు తక్కువ.. చేతలు ఎక్కువని కొనియాడారు. జమ్మలమడుగు జోష్ అదిరిపోయిందని.. గండికోటను, టీడీపీని ఎవరూ టచ్ చేయలేరని మంత్రి లోకేశ్ తేల్చి చెప్పారు.

# పెన్షన్లపై జగన్ అబద్ధాల ప్రచారం

## వైసిపి హయంలోనే 11 లక్షలు తొలగింపు
## మండిపడ్డ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి,మే22(శ్రీచక్ర) : పెన్షన్‌లపై మాజీ సీఎం వైఎస్ జగన్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలో 6 లక్షల పెన్షన్లు తొలగించారని జగన్ పచ్చి అబద్ధం చెప్పారన్నారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో ఏకంగా 11 లక్షల మంది నిరుపేదల పెన్షన్లను నిర్దాక్షిణ్యంగా తొలగించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మృతిచెందిన వారి పెన్షన్లు మాత్రమే రద్దయ్యాయని వివరించారు. కూటమి ప్రభుత్వంలో 22 నెలల్లో కొత్తగా 2.50 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తే.. 6 లక్షల పెన్షన్లు తొలగించారని జగన్ అబద్దాలు మాట్లాడుతున్నారని మంత్రి ÷ర్ అయ్యారు. ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో పెన్షన్ల కోసం రు.91 వేల కోట్లు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వంలో 22 నెలల్లోనే రికార్డు స్థాయిలో రూ.63,157 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. జగన్ రెడ్డి అబద్ధపు ప్రచారాలను రాష్ట్ర ప్రజలు ఎవరూ నమ్మవద్దని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు

# మావిగన్ పేరుతో మభ్యపెట్టే యత్నం

## ఐదేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్
## గొడ్డలి పార్టీ నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
## గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

కర్నూలు,మే22(శ్రీచక్ర) మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో అమరావతిని నాశనం చేయడమే కాకుండా.. ప్రస్తుతం మావి గన్ పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. శుక్రవారం తుగ్గలి మండలం జొన్నగిరిలో టీడీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టు పట్టించిన వైకాపా.. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. గొడ్డలి పార్టీ నాయకుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత తెదేపా శ్రేణులపై ఉందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని పార్టీ నేతలకు మంత్రి సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి పెట్టుబడి



పెట్టాలంటే ఎవరు రాలేని పరిస్థితి ఉండేదని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు పోటీపడి ముందుకు వస్తున్నారన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే మైనింగ్ శాఖలో రూ. 4 వేల కోట్లు అధికంగా రాబడి వచ్చిందని తెలిపారు. చంద్రబాబు నాయుడు పరిపాలన విధానాన్ని చూసి భారత దేశంలో వచ్చిన పెట్టుబడులలో 25 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చాయని అన్నారు. జొన్నగిరిలో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థ.. బంగారు శుద్ధి, ఉత్పత్తికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్ర సామాగ్రిని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు.

# అభినయ దర్శన వ్యవహారంపై విచారణ

## త్వరలోనే అసలు రంగు బయటపడతుంది
## హోం మంత్రి అనిత వెల్లడి

విశాఖపట్నం,మే22(శ్రీచక్ర) క్రైస్తవ మత ప్రచారకుడు, నటుడు అభినయ్ దర్శన్ వ్యవహారంపై హోం మంత్రి అనిత స్పందించారు. అభినయ్ దర్శన్ వ్యవహారంలో విచారణ జరుగుతోందని.. ఈ వ్యవహారంలో రాజకీయ కోణంపైనా పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కుట్రకోణం లేకపోతే కడప నుంచి అల్లూరి జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అమాయకపు గిరిజనులను అభినయ్ దర్శన్ నమ్మించి పాస్టర్ అవతారం ఎత్తారని.. ఆయనపై దాడి జరగకపోయినా జరిగిందని నమ్మించారన్నారు. అభినయ్ు దర్శన్ వ్యవహారంలో ఎవరు ఉన్నారనేది త్వరలో బయటపడుతుందని తెలిపారు. దర్శన్‌పై క్రిమినల్ కేసులు ఉన్నాయని.. వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రయత్నం చేశారని హోంమంత్రి వెల్లడించారు. ప్రభుత్వాన్ని బదనాం చేసే



దృక్పథం ఏమైనా ఉందా అనే కోణంలో విచారణ జరుగుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఇటువంటి నాటకాలు చెల్లవని.. ఇలాంటి ఆలోచనలు ఇంకెవరికైనా ఉంటే మానుకోవాలని హితవుపలికారు. ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభినయ్ దర్శన్‌ను కస్టడీలోకి తీసుకొని విచారణ చేస్తామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# విశాఖలో హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం

## తొలిసారిగా ఏర్పాటు చేసిన ఎపి ప్రభుత్వం
## లాంఛనంగా ప్రారంభించిన హోంమంత్రి అనిత



విశాఖపట్నం,మే22(శ్రీచక్ర) : విశాఖలో హోంగార్డు ఆరోగ్య బీమా సహాయ కేంద్రం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొని కేంద్రాన్ని ప్రారంభించారు. దేశంలోనే మొదటిసారిగా హోంగార్డులకు ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. సుమారు రూ.33 లక్షల వరకు బీమా కవరేజ్‌ను పొందవచ్చు. హోం మంత్రి అనిత ప్రోత్సాహంతో మొదటి విడతగా 975 మంది హోంగార్డులకు ఆరోగ్య బీమాను అందించనున్నారు. ఈ బీమా పథకం కింద భర్త, భార్య, ఇద్దరు పిల్లల వరకు కవరేజ్ ఉంటుంది. ఈ సందర్భంగా హోం మినిస్టర్ అనిత మాట్లాడుతూ.. పోలీసు వారికి వర్తించే ఆరోగ్య భద్రత.. హోంగార్డులకు వర్తించకపోవడం, వారి వేతనాలు తక్కువగా ఉండటం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఏడాది రూ.3 లక్షల నుంచి రూ.33 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం . దీని ద్వారా సుమారు 3,140 మంది లబ్ధి పొందనున్నారని తెలిపారు. హోంగార్డుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పూర్తి ఉచితంగా ఈ బీమా సదుపాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. విధుల్లో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు తిరిగి ఉద్యోగం కల్పించే పరిస్థితి లేనందున.. ఆ కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా ఈ ఆరోగ్య బీమా ఎంతో సహాయపడుతుందని హోం మంత్రి అనిత వివరించారు.

# హత్యారాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

## జగన్ చరిత్ర తెలిసిన వారికి ఇవన్నీ అర్థం అవుతాయి
## వైఎస్ మరణం, వివేకా మరణంపై జగన్‌వైపే అనుమానాలు
## జగన్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన మంత్రి అచ్చన్నాయుడు



అమరావతి,మే22: హత్యా రాజకీయాలు, అక్రమాల్లో ఆరితేరిన ఘనుడు జగన్ అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన చరిత్ర చూస్తే ఇదే కనిపిస్తుందని అన్నారు. ఇటీవల వైఎస్ జగన్ ఇమీడియా సమావేశంలో చేసిన కొన్ని సంచలన వ్యాఖ్యలపై మంత్రి కింజరావు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ కుటుంబంలో జరిగిన మరణాలకు సీఎం చంద్రబాబు నాయుడే కారణమంటూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రవర్తన చూస్తుంటే 'అపరిచితుడు' సినిమా పాత్ర గుర్తుకొస్తోందని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ తాత వైఎస్ రాజారెడ్డిని ఎందుకు హత్య చేశారో ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుసని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వైఎస్ కుటుంబం నడిపిన దమనకాండను, అరాచకాలను ఆనాటి బాధితుడు పార్థసారథిరెడ్డి స్వయంగా వివరించారని గుర్తుచేశారు. రాజారెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న వారందరినీ కాలక్రమేణా తుదముట్టించారు. అయితే, రాజారెడ్డి హత్యకేసులో ఉన్న వ్యక్తి ఇవాళ వైసీపీలోనే కొనసాగుతుండటం.. జగన్ ద్వంద్వ నీతికి నిదర్శనమని విమర్శించారు. వైఎస్ కుటుంబానికి ఉన్న క్రూరత్వం, అరాచకాల చరిత్ర ప్రస్తుత తరానికి పూర్తిగా తెలియాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో చంద్రబాబు నాయుడు మాట్లాడిన రెండు రోజులకే వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారంటూ జగన్ చేస్తున్న ప్రచారం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. ఆనాడు అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడిన మాటల అసలు సందర్భాన్ని వివరిస్తూ.. తిరుమల వేంకటేశ్వర స్వామికి ఎవరైనా కీడు తలపెడితే వారికి ఎప్పటికీ మంచి జరగదు అని మాత్రమే చంద్రబాబు అన్నారని గుర్తు చేశారు. ఆ మాటలను జగన్ ఇవాళ తన స్వార్థం కోసం వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో వైఎస్సార్ మరణం వెనుక 'రిలయన్స్' సంస్థ పాత్ర ఉందంటూ నానా హంగామా చేసి.. ఇప్పుడు చంద్రబాబును లాగడంలో అర్థం లేదన్నారు. ఇప్పటికైనా జగన్ ఇలాంటి వక్రీకరణలు మానుకోవాలని హితవు పలికారు. జగన్ బాబాయ్, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి ఎలా చనిపోయారో, ఆ హత్య వెనుక ఎవరున్నారో రాష్ట్ర ప్రజలందరికీ అచ్చెన్నాయుడు అన్నారు.


# సంపాదకీయం

## జెన్-జెడ్ ఉద్యమంగా కాక్రోచ్ జనతా పార్టీ


ఒక వ్యక్తికి వచ్చే కోపం.. పదిమందికి వస్తే అది ఉద్యమంగా మారుతుంది. ఆ తర్వాత అనేక గళాలు దానికి తోడైతే అప్పుడు దాన్ని తీవ్రత మారిపోతూ ఉంటుంది. ఇటువంటి ఉద్యమాలు ఈ ప్రపంచంలో చాలా జరిగాయి. చాలా మార్పులకు కారణమయ్యాయి. వ్యక్తులను దించేశాయి. వ్యవస్థలను మార్చేశాయి. నిద్రాణమైన సమాజాన్ని చైతన్యవంతం చేశాయి. అందుకే ఆగ్రహం అనేది ఒక వ్యక్తిలో అర్థవంతంగా కలిగితే కచ్చితంగా అది వ్యవస్థను మారుస్తుందని నిపుణులు అంటుంటారు.మనదేశంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నిరుద్యోగ యువతను బొద్దింకలుగా పోల్చారు. ఆ తర్వాత సోషల్ మీడియాలో ప్రచారం వేరే విధంగా మొదలైంది. కాక్రోచ్ అని సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు జనరేషన్ జెడ్ లో ఆగ్రహాన్ని కలిగించాయి. ఆ తర్వాత సామాజిక మాధ్యమాలలో క్యాంపెయిన్ మొదలైంది. ఆ ఉద్యమం ఇప్పుడు ప్రకంపనలకు దారితీస్తోంది.. ఏకంగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటయింది. కాకపోతే అది సోషల్ మీడియాలో మాత్రమే. ఈ పార్టీకి వ్యవస్థాపకుడిగా అభిజిత్ దీప్కేసోషల్ మీడియాలో ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకటే పేరు వినిపిస్తోంది. అదే కాక్రోచ్ జనతా పార్టీ. ఈ సెటైరికల్ వెబ్‌సైట్ కొద్దిరోజుల్లోనే 'బొద్దికల పార్టీ'గా భారతదేశంలోని సోషల్ మీడియాలో సంచలనాలు నమోదు చేస్తోంది. అభిజిత్ దీపక్ అనే వ్యక్తి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు, కన్వీనర్ అని ఆ పార్టీ వెబ్‌సైట్ చూపుతోంది. అయితే, ఇది ఇన్‌స్టాగ్రామ్‌లో సరికొత్త సంచలనాలు నమోదు చేస్తుంది.ఒక పార్టీ అధికారంలోకి రావాలంటే జనాలు ఓట్లు వేయాలి.. ప్రత్యర్థి పార్టీకి మించి ఓట్లు వస్తేనే అధికారాన్ని దక్కించుకోవడానికి సాధ్యమవుతుంది. అలాకాకుండా కేవలం సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను చూసి అధికారంలోకి వస్తామనుకుంటే అంతకు మించిన భ్రమ ఇంకొకటి ఉండదు. సోషల్ మీడియా ప్రామాణికమైతే ఇన్స్టాగ్రామ్ లో విరాట్ కోహ్లీకి 100 మిలియన్లకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. అలాంటప్పుడు ఆయన మన దేశానికి ప్రధానమంత్రి కావాలి కదా..కొంతమంది ఏదో ఆగ్రహంలో పెట్టిన కాక్రోచ్ జనతా పార్టీ.. ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఏకంగా బిజెపి పార్టీకి మించిన ఫాలోవర్స్ ను సంపాదించుకొని కలకలం రేపుతుంది. దీనిని చాలామంది జనరేషన్ జెడ్ తరంలో రగిలిన ఉద్యమం అని పిలుస్తున్నారు. ఇది సార్వత్రిక ఎన్నికల్లో పెను మార్పుకు నాంది పలుకుతుందని జోస్యం చెబుతున్నారు. సాధారణంగా ఇటువంటి సంచలన విషయాలు తెరపైకి వచ్చినప్పుడు.. కొంతమంది స్వయం ప్రకటిత మేధావులు రకరకాలు వ్యాఖ్యలు చేస్తూ ఉంటారు. ఇలాంటివారు కొద్ది రోజులు మీడియాలో హల్చల్ చేస్తారు. ఆ తర్వాత జనం మర్చిపోతారుమనదేశంలో ప్రజాస్వామ్యానికి ఒక విలువ ఉంది. దానికంటూ బలమైన నిర్మాణం ఉంది. అధికారంలో ఉన్న పార్టీ తప్పు చేస్తే. ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి అధికారాన్ని కట్టబెడతారు. ఒకవేళ రెండు పార్టీలు ప్రజల అభిమానాన్ని సొంతం చేసుకోకపోతే.. మూడో పార్టీకి అధికారాన్ని దక్కేలా చేస్తారు. అంతేతప్ప సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ఆధారంగా అధికారాన్ని కట్టబెట్టరు.. తాత్కాలిక ఆవేశాలు వేరు.. దీర్ఘకాలిక ప్రణాళికలు వేరు. రెండు కూడా ఒకే విధంగా ఎప్పుడూ ఉండవు. ఇక కాక్రోచ్ జనతా పార్టీ విషయంలో పాకిస్తాన్ హస్తము ఉందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది.. ఎప్పుడైతే ఈ పార్టీకి ఇన్స్టాగ్రామ్ లో విపరీతమైన ఫాలోవర్స్ నమోదయ్యారో.. అప్పుడే కొంతమంది దీని వెనక ఏదో జరుగుతోందని అనుకున్నారు. దానికి తగ్గట్టుగానే పరిశోధన మొదలుపెట్టారు. చివరికి అసలు నిజాన్ని బయటపెట్టారు.కాక్రోచ్ జనతా పార్టీ ని అనుసరిస్తున్న ఫాలోవర్స్ లో పాకిస్తాన్ నుంచి 49 శాతం, అమెరికా నుంచి 14 శాతం, బంగ్లాదేశ్ నుంచి 14%, ఇండియా నుంచి తొమ్మిది శాతం, యూకే, ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా, ఇతరులు మూడు శాతం, యూఏఈ నుంచి రెండు శాతం అనుసరిస్తున్నారు. దీని వెనక కుట్ర కోణం ఉందని.. అందువల్లే ఓవర్ నైట్ లో కాక్రోచ్ జనతా పార్టీకి ఈ స్థాయిలో ఫాలోవర్స్ ఉన్నారని సోషల్ మీడియాలో బిజెపి అనుకూల వ్యక్తులు వ్యాఖ్యానిస్తున్నారు.దేశంలో నిరుద్యోగ యువతను ఉద్దేశించి 'నిరుద్యోగ బొద్దింకలు' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా తాజాగా 'ఎక్స్' వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పుట్టికొచ్చింది. ఈ నెల 16న 'ఆప్' మాజీ రాజకీయ వ్యూహకర్త అభిజీత్ దిప్కే వ్యంగ్యపూరితంగా ఆ ఖాతాను ప్రారంభించారు. ఖాతా ప్రారంభమైన రెండు రోజు ల్లోనే, దేశవ్యాప్తంగా లక్షల మంది యువ త ఖాతాను ఫాలో అయ్యారు.ముఖ్యంగా ఖాతాకు 'జెన్‌జెడ్' మద్దతు అనూహ్యంగా పెరుగుతూ వస్తుంది. ఈ క్రమంలో నిఘావర్గాలు ఆ ఖాతాను తొలగించాయి. మై భీ కాక్రోచ్ (నేను కూడా బొద్దికనే) అనే నినాదంతో కాక్రోచ్ జనతా పార్టీ ఆన్‌లైన్‌లో సంచలనం సృష్టిస్తోంది. యువత ఎదుర్కొంటున్న సమస్యలను వ్యంగ్యంగా, హాస్యంగా ప్రస్తావిస్తూ ఈ పార్టీ లక్షలాది మందిని ఆకర్షిస్తోంది. కొద్దిరోజుల్లోనే ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పేజీ ఏకంగా 12.7 మిలియన్ల పైగా ఫాలోవర్లను సంపాదించుకుని ఇంటర్నెట్ సెన్సేషన్‌గా మారింది. యూట్యూబ్ సెన్సేషన్, బీజేపీ విధానాలను విమర్శించే ధ్రువ్ రాఠీ కూడా తాను ఆ పార్టీలో చేరతానంటూ ప్రకటించారు.వార్తా సేవలుకాక్రోచ్ జనతా పార్టీని స్థాపించింది అభిజీత్ దీప్కే. దీంతో ఎవరీ అభిజీత్ దీప్కే అని నెటిజన్లు వెతుకుతున్నారు. అభిజీత్ మహారాష్ట్రంలోని ఛత్రపతి శంభాజీ నగర్ కు చెందిన వ్యక్తి. అతను పూణెలో జర్నలిజం చదివాడు. ఆ తరువాత ఇంట్లోనే పోస్ట్ గ్రాడ్యుయేషన్ కు ప్రిపేరయ్యాడు. బోస్టన్ యూనివర్శిటీలో పబ్లిక్ రిలేషన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేయడానికి అమెరికా వెళ్లాడు. 2020 నుంచి 2022 వరకు ఆమ్ ఆద్మీ పార్టీ సోషల్ మీడియా సిబ్బందిలో ఉద్యోగిగా పనిచేశాడు. 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రచారం కోసం వైరల్ మీమ్ ఆధారిత కంటెంట్ ను రూపొందించడంలో కీలక భూమిక పోషించినట్లు తెలిసింది. కాక్రోచ్ జనతా పార్టీని ఏర్పాటు చేసి.. ఆ పార్టీ కోసం ఒక వెబ్ సైట్ తోపాటు ఇన్ స్టాగ్రామ్, ట్విటర్ వంటి సోషల్ మీడియా ఖాతాలను సైతం ఏర్పాటు చేశాడు.

# గోమాత గొప్పతనం చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల్లో తెలుసుకోవడం అదృష్టంగా ఉంది..

**రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తా.**
**చాగంటి కోటేశ్వరరావు యుగ పురుషుడు..**
**మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్**





కర్నూలు, మే, 22 (శ్రీచక్ర): ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు యుగ పురుషుడు అని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. శుక్రవారం కర్నూల్ నగరంలోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్‌జోసెఫ్ డిగ్రీ కళాశాల మైదానంలో గోమాత వైభవంపై చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తాతో కలిసి టీజీ వెంకటేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా గోమాతకు పూజ చేసి అనంతరం గో ప్రాధాన్యత.. గోసేవావశ్యకత అనే పుస్తకం ఆవిష్కరించారు. మొదటి పుస్తకాన్ని టీజీ వెంకటేష్, టీజీ భరత్ లకు చాగంటి కోటేశ్వరరావు అందించారు. అనంతరం టీజీ వెంకటేష్ మాట్లాడుతూ చాగంటి లాంటి గొప్ప వ్యక్తులు ఉన్నారు కాబట్టే మనమందరం బాగున్నామని చెప్పారు. చాగంటి అనుకుంటే వందల కోట్లు సంపాదించొచ్చు కానీ చాగంటికి డబ్బుపై ఆశ లేదని.. తెలిసినది ప్రజలకు చెప్పడమే ఆయనకు తెలుసన్నారు. టీజీ భరత్ గోమాతకు పూజ చేయడం, గోవులను సంరక్షించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. చాగంటి కోటేశ్వరరావు తమకు సన్మానం చేయడం తమ పూర్వజన్మ సుకృతం అని టీజీ వెంకటేష్ అన్నారు. అనంతరం మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ చాగంటి కోటేశ్వరరావు కర్నూలుకు రావడం తమ అదృష్టం అన్నారు. క్యాబినెట్ ర్యాంక్ ఉన్నప్పటికీ ఆయన సామాన్యుడిలాగే ప్రయాణం చేస్తారని చెప్పారు. రాజకీయాల్లో ఎలా ఉండాలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల్లో తెలపాలన్నారు. ఏపీలోనే గోశాల కర్నూలులో ఉందన్నారు. గాయత్రి గోశాలలో 1200 పైగా ఆవులు ఉన్నాయన్నారు. గోమాతకు ఎలా పూజ చేయాలో పుస్తక రూపంలో తెలుపడం వల్ల ఎంతోమందికి ఉపయోగకరంగా ఈ కార్యక్రమంలో గాయత్రి గోశాల, గాయత్రి గోసేవ సమితి సభ్యులు పాల్గొన్నారు. ×చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ..గోసేవ ఎంతో గొప్పదని చెప్పారు. గోవును దానం చేయడం అంత గొప్ప దానం ఇంకోటి లేదన్నారు. ప్రతి రోజూ గోమాత సేవ చేయాలన్నారు. మనసు ఉత్సాహంగా ఉండాలంటే గోవును స్మరిస్తూ ఉండాలన్నారు. గోవులు సంచరించిన ప్రదేశం కంటే పవిత్రమైన ఇంకెక్కడా ఉండదు అని ఆయన అన్నారు.

# వడదెబ్బ తో వ్యవసాయ కూలీ మృతి..,కుటుంబ యజమాని మృతి చెందడంతో దిక్కులేని స్థితిలో భార్య,బిడ్డలు...,



కోట : మే 22 (శ్రీ చక్ర):మండల పరిధిలోని గూడలి పంచాయతీ అరుంధతివాడ కు చెందిన యల్లసిరి.వెంకటేశ్వర్లు(47) అనే వ్యక్తి కూలీ పనులకు వెళ్లి వడదెబ్బ తో మృతి చెందారు.ఈ మేరకు గురువారం మధ్యాహ్నం యల్లసిరి.వెంకటేశ్వర్లు ఆకస్మాత్తుగా అస్వస్థకు గురికావడంతో ప్రథమ చికిత్స చేశారు.ప్రథమ చికిత్స చేసిన తర్వాత కూడా నయం కాకపోవడంతో కోట ఆసుపత్రి కి తీసుకుని వెళ్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు.మృతి చెందిన యల్లసిరి.వెంకటేశ్వర్లు కు భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఆ కుటుంబంలో వెంకటేశ్వర్లు కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నారు.ప్రస్తుతం ఆ కుటుంబ సభ్యులు వీధిన పడ్డారు.

# కిశోరి వికాసం,బాల్య వివాహాలపై అవగాహన...,జాగ్రత్తలు పాటించాలని సూపర్వైజర్ ఐ.క్రిష్ణమ్మ వెల్లడి..,



కోట : మే 22 (శ్రీ చక్ర):బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరు అవగాహన చేసుకోవాలని అంగన్వాడి సూపర్వైజర్ ఐ.కృష్ణమ్మ తెలిపారు.ఈ సందర్భంగా శుక్రవారం కోట మండలంలోని తిన్నెలపూడి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కిశోరి బాలికలకు బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను క్షుణ్ణంగా వివరించారు. అదేవిధంగా చిన్న వయసులో గర్భధారణ వలన కలిగే ఇబ్బందులు,రక్తహీనత, అనీమియా,వ్యక్తిగత పరిశుభ్రత,పోషక ఆహారం గురించి 11 సంవత్సరాల నుండి 17 సంవత్సరాల లోపు బాలికలకు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు వంజివాక. శశి,పి.సురేఖ,ఆర్ మాధవి పాల్గొన్నారు.

# మండల అభివృద్దే ధ్యేయంగా పనిచేద్దాం

**ప్రజలకు సేవ అందిస్తూ మన కర్తవ్యం పాటిద్దాం ఎమ్మెల్యే ఆదిమూలం**



వరదయ్యపాలెం మే 22(శ్రీ చక్ర) వరదయ్యపాలెం మండల మీట్ లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంరోడ్లు, వంతెనలు నిర్మాణ పనులపై ఎమ్మెల్యే ఆరామండల అభివృద్దే ధ్యేయంగా పని చేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు.శుక్రవారం వరదయ్య పాలెం ఎంపిడిఓ కార్యాలయం లో నిర్వహించిన సాదారణ సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని ప్రసంగించారు.మండలంలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని నిధులు మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడ దెబ్బ వంటి సమస్యతో ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లు, సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు.ఇక నియోజకవర్గంలో పూర్తయిన గ్రామ సచివాలయ భవనాలు, ఆరోగ్య కేంద్రాలు, రైతు సేవా కేంద్ర భవనాలను వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు.అనంతరం శాఖల వారీగా తమ ప్రగతి నివేదికలను అధికారులు సభలో చదివి వినిపించారు.వంతెనలు, రోడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి,వరదయ్య పాలెం మండలం లో నిర్మాణ దశలో ఉన్న వంతెనలు, రోడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఇంజనీరింగ్ ఉన్నతాధికారులకు సూచించారు.రూ.20 లక్షలతో గోవర్ధన పురం వంతెన నిర్మాణం, రూ.3 కోట్లతో పాండూరు రోడ్డు నిర్మాణం, రూ.2.50 కోట్ల తో తడా నుండి శ్రీ కాళహస్తి వరకు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమైందని, వాటిని త్వరగా పూర్తి చేయాలని డీఈ, ఏఈ లకు ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు కూటమి పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు వైసీపీ జీర్ణించుకోలేకపోతుంది.. :మంత్రి టీజీ భరత్ గుప్తా

**అన్నా క్యాంటీన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి**



కర్నూలు, మే, 22 (శ్రీచక్ర): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు వైసీపీ జీర్ణించుకోలేకపోతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. కర్నూలు సర్వజన ఆసుపత్రిలో ఉన్న అన్నా క్యాంటీన్ ను మంత్రి టీజీ భరత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం చేస్తున్న వృద్ధులు, మహిళలతో మాట్లాడి సరిగ్గా భోజనం పెడుతున్నారా, రుచికరంగా ఉందా అని ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పండని పదే పదే అడిగారు. ఆ తర్వాత అన్నా క్యాంటీన్ పరిసర ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ..ప్రజలకు భోజనం పెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాస్తవ పరిస్థితి తెలుసుకునేందుకు ఈ ఆకస్మిక తనిఖీ చేశానని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రికి ఎంతో మంది ఇతర ప్రాంతాల నుండి వస్తుంటారని.. అన్నా క్యాంటీన్ లో పెడుతున్న భోజనం వల్ల వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ''ఆహారం చాలా బాగుందని ప్రజలు చెబుతున్నారు. ఏ ఒక్కరిని అడిగినా పాజిటివ్ రెస్పాన్స్ కనిపిస్తోంది. గత ప్రభుత్వం అన్నా క్యాంటీన్ లను మూసివేసి అరాచక పాలన సాగించింది. మా ప్రభుత్వంలో పేదల ఆకలి అన్నా క్యాంటీన్ ద్వారా తీర్చుతున్నామని టీజీ భరత్ చెప్పారు. ఇక ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంటే వైసీపీ జీర్ణించుకోలేక పోతుందన్నారు.

## వగరూరులో కిశోరి వికాసం కార్యక్రమం



మంత్రాలయం , మే 22,(శ్రీచక్ర) : మంత్రాలయం మండల పరిధిలోని వగరూరు గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్వైజర్ సుమిత్రమ్మ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర దశలో బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకో వాలని, సమతుల ఆహారం, పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, మెన్‌స్ట్రువల్ హైజీన్‌పై బాలికలు సిగ్గుపడకుండా అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. అలాగే బ్యాంకు ఖాతా నిర్వహణ, పొదుపు, విత్‌డ్రా వంటి ఆర్థిక అంశాలపై కూడా బాలికలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త సువర్ణ, ఉపాధ్యాయులు శిల్ప తదితరులు పాల్గొని బాలికలకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు చేశారు. టీనేజ్‌లో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై వివరించారు.

## ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలకు బడి పిలుస్తోంది

కోట : మే 22 (శ్రీ చక్ర):మండలం పరిధిలోని ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలను పెంచేందుకు విద్యాశాఖ అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు.ఈ సందర్భంగా స్థానిక ఎంఈఓ 1 శిరీష ఆధ్వర్యంలో శుక్రవారం కోట మండలంలోని చిట్టేడు మండల ప్రజా పరిషత్ స్కూల్ పరిధిలో ప్రవేశాల ప్రచారాన్ని ఇంటింటి ప్రచారం నిర్వహించి,ర్యాలీని చేపట్టారు. ప్రభుత్వ బడుల్లో ప్రవేశాల కోసం విద్యాశాఖ అధికారులు,పాఠశాల ఉపాధ్యాయులు,అంగన్వాడీ టీచర్లు,స్థానికులు భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు పూర్తయిన పిల్లల్ని ప్రాథమిక పాఠశాలలోను, ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ను ఉన్నత పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అధికారులు వివరిస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం, ఉచిత పుస్తకాలు,యూనిఫామ్ ల వంటి సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సురేఖ,అంగన్వాడీ టీచర్ జయశ్రీ తల్లిదండ్రులు,పిల్లలు పాల్గొన్నారు.



# మైనింగ్ రంగం ద్వారా సంపద సృష్టితో పాటు ఉపాధి కల్పన ప్రభుత్వ లక్ష్యం

## జనాభా గణనను వేగవంతంగా పూర్తి చేయాలి : సెన్సెస్ డైరెక్టర్ నివాస్

**నంద్యాల జిల్లాలో 83.26 శాతం జనాభా గణన పూర్తి : కలెక్టర్ రాజకుమారి**

**వలస కార్మికులు, హాస్టల్ విద్యార్థుల వివరాల నమోదుపై ప్రత్యేక దృష్టి**




నంద్యాల, మే 22 (శ్రీచక్ర): జిల్లాలో జనాభా గణన ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని సెన్సెస్ డైరెక్టర్ నివాస్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుండి జనాభా గణన పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, డీఆర్ఓ రామునాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం జనాభా సుమారు 21.36 లక్షలుగా నమోదవుతుండగా, ఇప్పటివరకు 83.26 శాతం గణన ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఎన్నికల అంచనాల ప్రకారం జిల్లా జనాభా సుమారు 19.13 లక్షలుగా ఉండగా, గ్రామ/వార్డు సచివాలయాల (ఉ వాచిూ) డేటా ప్రకారం అది 20 లక్షల వరకు ఉండే అవకాశముందని వివరించారు. పాణ్యం మండలంలో జనాభా గణనలో వ్యత్యాసాలు అధికంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. మండల పరిధిలో రెండు ఇంజనీరింగ్ కళాశాలలు, ఒక మెడికల్ కళాశాలతో పాటు పలు ప్రైవేట్ విద్యాసంస్థలు ఉండటంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు అక్కడ నివసిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలు, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు మరియు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి వివరాలను సమగ్రంగా నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా, నంద్యాల పట్టణం బ్యాంకింగ్ కోచింగ్ ఇన్స్టిట్యూట్లకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడంతో ఇతర రాష్ట్రాల నుంచి కూడా అనేక మంది విద్యార్థులు, అభ్యర్థులు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. దీంతో కొంత సమాచారం ఇంకా నమోదు దశలో ఉన్నట్లు వెల్లడించారు. వలస కార్మికులు, చిన్నారులు, లేబర్ కాలనీలు, నిర్మాణ ప్రాంగణాల్లో నివసిస్తున్న కుటుంబాలు సాధారణ ఊహిూ పరిధిలోకి రాకపోయే అవకాశమున్నందున, అటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సెన్సెస్ డైరెక్టర్ సూచించారు. గుంటూరు?అమరావతి ప్రాంతాల్లో అమలు చేసిన విధానాలను ఆదర్శంగా తీసుకొని ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అలాగే, లాక్ చేసి ఉన్న ఇళ్లను తిరిగి సందర్శించి వివరాలను సేకరించడంతో పాటు, ఎవరూ మిగిలిపోకుండా జనాభా గణన ప్రక్రియను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఈవీఎం గోదాముల డోర్ లాక్ సీళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



నంద్యాల, మే 22 (శ్రీచక్ర): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మాసపు తనిఖీల్లో భాగంగా నంద్యాల పట్టణంలోని టేక్కే మార్కెట్ యార్డ్‌లో భద్రపరిచిన ఈవీఎంల గోదాములను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాముల డోర్ లాక్ సీళ్ల స్థితిని పరిశీలించిన కలెక్టర్, ఈవీఎంల భద్రతకు సంబంధించిన రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా అమలవుతున్నాయా అనే అంశాలను సమగ్రంగా సమీక్షించారు. ఈవీఎంల భద్రత అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్న కలెక్టర్, గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ లాగ్‌బుక్‌ను పరిశీలించి, విధుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ పనితీరును పరిశీలించిన కలెక్టర్, అగ్నిమాపక పరికరాల అందుబాటు మరియు వాటి పనితీరుపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. డోర్ లాక్ సీళ్ల భద్రతా అంశాలను పరిశీలిస్తూ, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## రాత్రివేళల్లో కొనసాగుతున్న విజిబుల్ పోలీసింగ్

**రోడ్డు ప్రమాదాల నివారణకు "స్టాప్ - వాష్ అండ్ గో" కార్యక్రమం**

కర్నూలు, మే, 22 (శ్రీచక్ర): కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో రాత్రివేళల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. కర్నూలు టూ టౌన్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, రద్దీ ప్రాంతాలు మరియు అనుమానాస్పద ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేపట్టారు. రాత్రి నుండి తెల్లవారుజాము వరకు కర్నూలు పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు.జాతీయ రహదారులపై లారీలు, బస్సులు మరియు ఇతర వాహనాలను ఆపి డ్రైవర్లకు విశ్రాంతి కల్పిస్తూ, నీటితో ముఖం కడిగించి అప్రమత్తం చేస్తున్నారు. అలసటతో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో "స్టాప్ - వాష్ అండ్ గో'' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.అతి వేగం, రాంగ్ రూట్, అధిక ప్రయాణికులతో వాహనాలు నడిపే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



**జొన్నగిరి గోల్డ్ మైన్స్‌ను సందర్శించిన రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర : పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ బాబు**





కర్నూలు, మే, 22 (శ్రీచక్ర): మైనింగ్ రంగం ద్వారా సంపద సృష్టితో పాటు ఉపాధి కల్పన ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.శుక్రవారం తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ సమీపంలో ఉన్న జియో మైసూర్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తున్న గోల్డ్ మైన్స్‌ను రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ బాబు కలిసి సందర్శించారు. గోల్డ్ మైనింగ్ కార్యకలాపాలు, ఆధునిక సాంకేతిక పద్ధతులు, ఖనిజ శుద్ధి ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ జొన్నగిరి గోల్డ్ మైన్స్‌లో అత్యాధునిక యంత్రాంగం, నూతన సాంకేతిక పద్ధతులు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం గనుల్లో సుమారు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల లోతు వరకు వెళ్లే అవకాశముందని తెలిపారు. లోతుకు వెళ్లే కొద్దీ బంగారం నిల్వలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుతం రోజుకు సగటున ఒక కిలో బంగారం ఉత్పత్తి అవుతుండగా, నెలకు సుమారు 30 కిలోల వరకు ఉత్పత్తి చేస్తున్నారని వెల్లడించారు. జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో సుమారు 13 వేల టన్నుల వరకు ఖనిజ నిల్వలు ఉన్నాయని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు రెండు లక్షల టన్నుల ఖనిజాన్ని ప్రాసెసింగ్ చేసినట్లు వివరించారు. ఈ గోల్డ్ మైన్ దేశంలోనే తొలి ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఇంకా విస్తృత అవకాశాలు ఉన్నాయని, అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైనింగ్‌కు అనుకూల ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. త్వరలోనే అక్కడి ప్రక్రియలను పూర్తి చేసి అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ కాలంలో మైనింగ్ రంగం నిర్లక్ష్యానికి గురైందని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఖనిజ సంపదను రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. రాష్ట్ర తీరప్రాంతాల్లో లభించే రేర్ ఎర్త్ మినరల్స్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉందని, చైనాకు పోటీగా నిలిచే స్థాయిలో మన దేశంలో ఖనిజ వనరులు ఉన్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ అభివృద్ధికి అవసరమైన బ్లాకులను గుర్తించి టెండర్ ప్రక్రియలు పూర్తి చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా క్వార్ట్జ్ ఖనిజానికి విలువ ఆధారిత పరిశ్రమలు తీసుకువచ్చి, సోలార్ ప్యానెల్స్ వంటి ఉత్పత్తులను రాష్ట్రంలోనే తయారు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. దీని ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని చెప్పారు. అలాగే రాష్ట్రంలో లభించే గ్రానైట్‌కు అంతర్జాతీయ మార్కెట్లో భారీ డిమాండ్ ఉందని, వాటిని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి అలంకార వస్తువుల తయారీకి ప్రోత్సాహం అందించనున్నట్లు వెల్లడించారు. జొన్నగిరి గోల్డ్ మైన్స్‌ను ముఖ్యమంత్రి త్వరలో సందర్శించే అవకాశముందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించి మైనింగ్ రంగంలో గత ఏడాదితో పోలిస్తే 30 శాతం వృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. భవిష్యత్తులో మైనింగ్ రంగం ద్వారా రాష్ట్రానికి మరింత ఆదాయం, ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ప్రాంతీయాభివృద్ధికి కొత్త దిశ ? యువతకు ఉపాధి, రాష్ట్రానికి ఆదాయం. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు. జొన్నగిరి గోల్డ్ మైన్ సందర్శన సందర్భంగా ఎమ్మెల్యే కే.ఈ శ్యాంబాబు మాట్లాడుతూ...గత ప్రభుత్వ హయాంలో సరైన ప్రోత్సాహం, పారదర్శకత లేకపోవడం వల్ల ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదన్నారు. అప్పటి పాలకుల వైఖరి కారణంగా సంస్థ అనేక ఇబ్బందులు ఎదుర్కొని, తటస్థ ధోరణిలో కొనసాగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గోల్డ్ మైన్ కార్యకలాపాలు వేగవంతమయ్యాయని చెప్పారు. జొన్నగిరి గోల్డ్ మైన్ ద్వారా రాష్ట్రానికి గణనీయమైన ఆదాయం సమకూరుతుండటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి లభిస్తోందన్నారు. ఇప్పటికే 300 నుండి 400 మందికి పైగా స్థానిక యువతకు, విద్యావంతులకు, కార్మికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రతి సంవత్సరం ఎండాకాలంలో వలసలకు వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు గోల్డ్ మైన్ కారణంగా స్థానికంగా ఉపాధి లభిస్తూ వలసలను తగ్గించే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పర్యావరణ అనుమతులు, నీటి కేటాయింపులు వంటి కీలక అంశాలు అప్పటి ఉప ముఖ్యమంత్రి కే.ఈ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూర్తి అయ్యాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అనుకూల వాతావరణాన్ని కల్పించడంతో గోల్డ్ ప్రొడక్షన్ విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఓపెన్ మైనింగ్ కార్యకలాపాలు కూడా ప్రారంభం కానున్నాయని, దాంతో మరింత పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. స్థానిక యువతకు ఉద్యోగాలు, ప్రాంతానికి ఆర్థికాభివృద్ధి, రాష్ట్రానికి ఆదాయం తీసుకొచ్చే ఈ ప్రాజెక్ట్ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఓబులేసు, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, బోయ కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఇంచార్జ్) నాగిని, డి.ఎస్.పి వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఒక నెల- ఒక నియోజకవర్గం- 4 పర్యటనలు కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

**ప్రతి శుక్రవారం ఒక నెల- ఒక నియోజకవర్గం- 4 పర్యటనలు కార్యక్రమ నిర్వహణ:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**





కర్నూలు, మే 22 (శ్రీచక్ర): ప్రతి నియోజకవర్గంలో "ఒక నెల ఒక నియోజకవర్గం 4 పర్యటనలు" కార్యక్రమాన్ని 4 సార్లు నిర్వహించి ప్రజల నుండి అర్జీలు తీసుకుని పరిష్కరించడం జరుగుతుందని, వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం "ఒక్క నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా పాణ్యం నియోజకవర్గం రెండవ సందర్శనకు సంబంధించి స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "ఒక నెల ఒక నియోజకవర్గం 4 పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా పాణ్యం నియోజకవర్గంలో రెండవ విడత సందర్శన కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. మొదటి విడత సందర్శన లో స్వీకరించిన అర్జీలపై అధికారులు తీసుకున్న చర్యలకు సంబంధించిన ఆర్డర్లు ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫైనాన్షియల్ అంశాలకు సంబంధించిన అర్జీలపై అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాలని, అమలు సాధ్యం కాని అర్జీలకు "నాట్ ఫీజిబుల్''గా స్పష్టమైన ఆర్డర్లు ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పరిష్కరించగలిగే అర్జీలపై వెంటనే చర్యలు తీసుకుని సంబంధిత ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. వచ్చే శుక్రవారం నిర్వహించే మూడవ విడత పర్యటనలో రెండవ విడతలో స్వీకరించిన అర్జీల పరిష్కారానికి సంబంధించిన ఆర్డర్లు, ఎండార్స్‌మెంట్‌లను తప్పనిసరిగా తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీలపై తీసుకున్న చర్యలు ప్రజలకు కనిపించేలా డిస్ప్లే చేయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న అర్జీలు, ముఖ్యంగా బ్రిడ్జిలు, రోడ్లు వంటి ఆర్థిక సంబంధిత అభ్యర్థనలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నామనే విషయాన్ని తెలియజేస్తే, తమ పిటిషన్ పురోగతి ఏ దశలో ఉందో అర్జీదారులకు స్పష్టత వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు తీసుకున్న చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా పారదర్శకత మరింత పెరుగుతుందన్నారు. పరిష్కరించలేని అర్జీల విషయంలో కూడా స్పష్టమైన కారణాలు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. "ఈ కారణాల వల్ల పని చేయలేము", "ఇది సాధ్యం కాదు" లేదా "ప్రభుత్వానికి పంపిస్తున్నాం" వంటి క్లారిటీ ఇవ్వడం ద్వారా అర్జీదారులు ఇబ్బందులకు గురికాకుండా ఉంటారని తెలిపారు. ప్రతి అర్జీదారుకు తప్పనిసరిగా స్పష్టమైన సమాచారం అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నాల్గవ విడత పర్యటనలో గత మూడు విడతలలో పరిష్కరించిన గ్రీవెన్సెస్‌ను డిస్ప్లే చేయడంతో పాటు, పరిష్కరించలేని అర్జీలకు సంబంధించిన కారణాలను కూడా ప్రజలకు వివరించాలన్నారు. అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇచ్చిన అనంతరం, అందజేసిన కాపీకి సంబంధించిన అక్నాలెడ్జ్‌మెంట్‌ను అధికారులు భద్రపరచుకోవాలని కలెక్టర్ సూచించారు..కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్,కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ కృష్ణ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఐసిడిఎస్ పిడి విజయ, డిఎంహెచ్ఓ డా.కామేశ్వర రావు, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, డి ఆర్ డి ఏ పిడి రమణా రెడ్డి, , డ్వామా పిడి నరసింహా రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి దీప్తి, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, ఓర్వకల్లు తహశీల్దార్ విద్యా సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## రేపటితో ముగియనున్న ఎల్ఆర్‌యస్ మేళా



**ఎల్ఆర్‌యస్ దరఖాస్తుల పెండింగ్ సమస్యలకు ప్రత్యేక పరిష్కారం**

**ఫీజు చెల్లింపులు, షార్ట్‌ఫాల్ పత్రాలు, అప్రూవల్ ప్రొసీడింగ్స్ ఒకేచోట**

**చివరి అవకాశాన్ని వినియోగించుకోవాలి**

**నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు సూచన**

కర్నూలు, మే, 22 (శ్రీచక్ర): నగర పరిధిలో అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఎల్ఆర్‌యస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ప్రజల కోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్ఆర్‌యస్ మేళా శనివారంతో ముగియనుందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి నిర్వహించిన మేళాకు విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎల్ఆర్‌యస్ దరఖాస్తులకు సంబంధించిన షార్ట్‌ఫాల్ పత్రాలు, ఫీజు ఇంటిమేషన్, చెల్లింపులు, అప్రూవల్ ప్రొసీడింగ్స్ తదితర అంశాలను ఒకేచోట పరిష్కరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లింపులు లేదా అవసరమైన పత్రాల సమర్పణలో పెండింగ్‌లో ఉన్న వారికి ఈ మేళా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్‌టిపిలు అందుబాటులో ఉండటంతో దరఖాస్తుదారులు అక్కడికక్కడే తమ సమస్యలను పరిష్కరించుకుని అప్రూవల్ ప్రొసీడింగ్స్ పొందవచ్చని తెలిపారు. శనివారంతో ఈ ప్రత్యేక మేళా ముగియనున్నందున ప్రజలు చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆస్తులకు పూర్తి చట్టబద్ధత కల్పించుకోవాలని కమిషనర్ కోరారు

## గోపూజతో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు



ఆదోని, మే, 22 (శ్రీచక్ర): ఆదోని పట్టణం, వసంత టాకీస్ సమీపంలోని శ్రీ రుక్మిణి పాండురంగస్వామి దేవస్థానం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం వత్ససహిత గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలతో అత్యంత భక్తి శ్రద్ధలతో ముగిసినవి. ప్రతిరోజు ఇస్కాన్ ధర్మప్రచారకులు నిత్యతృప్తదాస్ చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు మహేంద్రకర్ లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు జె. ఈశ్వరరావు, కార్యదర్శి జవేల్కర్ బాబురావు, సంయుక్త కార్యదర్శి జె. వెంకటేశ్వరరావు, కోశాధికారి పతంగి నరసింగరావు, వడే రఘు, సూత్రవే ఆనంద్, సరోదే వెంకోబరావుతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## సత్వర సమస్యల పరిష్కారమే నియోజకవర్గ స్థాయి పీ జీ ఆర్ ఎస్ ల లక్ష్యం.



మార్కాపురం మే 22 ( శ్రీ చక్ర)మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత.సత్వరం.సమస్యలను.పరిష్కరించడమే నియోజకవర్గస్థాయి పీజీ ఆర్ఎస్ ల లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల ప్రకారం పట్టణంలోని మాధవి గ్రాండ్ ఇన్ లో శుక్రవారం నియోజకవర్గస్థాయి పీజిఆర్ఎస్ కార్యక్రమం లో ఆమె ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నెల రోజుల సమయంలోనే అర్జీల పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేయడం ద్వారా అర్జీలకు సరైన పరిష్కారం దొరుకుతుందన్నారు. ఆ దిశగా రెవిన్యూ అధికారులు ముందుకు పోవాలని ఆదేశించారు. ఒక మంచి లక్ష్యంతో చేపట్టిన నియోజకవర్గ స్థాయి పీజిఆర్ఎస్ కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మొత్తం 71 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూకు సంబంధించి 40, ఇతర సమస్యలపై 31 అర్జీలు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ వెంకట శివరామిరెడ్డి, ఆర్డిఓ ప్రభాకర్, హౌసింగ్ పీడీ మోహన్ రావు, డి ఎల్ డి ఓ బాలు నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన జిల్లా విద్యాశాఖ అధికారి సోము సుబ్బారావు



మార్కాపురం మే 22 (శ్రీ చక్ర)మార్కాపురం జిల్లాకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావును ఎస్టీయూ జిల్లా, మండల నాయకులు ఘనంగా సన్మానించారు.ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు టి.కె.యస్. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్. దేశా నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి డీఈఓను అభినందించారు. ఈ సందర్భంగా దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయవాణి కన్వీనర్ షేక్ యూసఫ్ షరీఫ్, కొమరోలు మండల అధ్యక్షుడు పి. రామ్ ప్రసాద్, తర్లుపాడు మండల అధ్యక్షుడు కె.వి. జగన్ బాబు, ప్రధాన కార్యదర్శి నజీర్ అహ్మద్, ఆర్థిక కార్యదర్శి అంజనీ కుమార్ పాల్గొన్నారు. అలాగే కార్యవర్గ సభ్యులు సిహెచ్. శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ,హనుమంతరావు, అబ్దుల్ సుకూర్, ఆదినారాయణ, బొప్పరాజు శ్రీనివాసులు, రాజా రమేష్, ఎన్. ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో విద్యా అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. దీనికి స్పందించిన డీఈఓ సామ సుబ్బారావు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యా ప్రమాణాల పెంపుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.

## డా. షేక్ మహబూబ్ వలికి 115వ జాతీయ అవార్డు కైవసం

### కర్ణాటక హుబ్లీలో నేషనల్ ప్రెస్టేజ్ అవార్డు ప్రదానం





మార్కాపురం మే 22 ( శ్రీ చక్ర (మార్కాపురం ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి గ్లోబల్ రీసెర్చ్ ఫౌండేషన్ వారి నేషనల్ ప్రిస్టేజ్ అవార్డు"ను ఈ నెల 30వ తేదీన కర్ణాటక రాష్ట్రం హుబ్లీ నగరంలో అందుకోనున్నారు. ఇది వారి 115వ అవార్డగతంలో డా. మహబూబ్ వలి సామాజిక సేవలకు 114 అవార్డులు, 22.గౌరవ.డాక్టరేట్లు.అందుకున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు పొందారు.ప్రస్తుత బాధ్యతలు:× వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ చైర్ పర్సన్ ఐదు సంస్థలకు ఏపీ రాష్ట్ర అధ్యక్షులు సివిల్ పబ్లిక్ వెల్ఫేర్ సర్వీస్, కరప్షన్ ఫ్రీ ఇండియా, భారతీయ కిసాన్ యూనియన్ (అమర్ టికేత్), స్వర్ణిం భారత్ సమాజ్ కళ్యాణ్ ఫౌండేషన్, యోగదనం దానం సాహరా సమితి.రాజకీయ, సామాజిక రంగాల్లో చురుకుగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి, సామాజిక సేవకు ఎక్కువ సమయం కేటాయిస్తున్న డా. మహబూబ్ వలి ని పలువురు అభినందించారు.

## ఎవరెస్ట్ దిగుతూ ఇద్దరు భారతీయ పర్వతారోహకులు మృతి

ఖాట్మాండు: నేపాల్లో ఎవరెస్ట్శిఖరాన్ని ఎక్కిన ఇద్దరు భారతీయులు మృతిచెందారు. ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతున్న సమయంలో ఆ ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు శుక్రవారం తెలిసింది. నేపాల్ పర్వతారోహణ అధికారి రిషి భండారి ఈ విషయాన్ని ఇవాళ వెల్లడించారు. ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతున్న సమయంలో.. ఓ పర్వతారోహకుడు తీవ్రంగా అలసిపోయినట్లు చెప్పారు. అయితే అతని ప్రాణాలను కాపాడేందుకు షెర్పాలు తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిపారు. హిల్లరీ స్టెప్ వద్ద అరుణ్ తివారి అనే పర్వతారోహకుడు మృతిచెందినట్లు భండారి చెప్పారు. సందీప్ ఆరె అనే వ్యక్తి రెండో క్యాంప్ వద్ద ప్రాణాలు కోల్పోయాడు.ఎవరెస్ట్ను అత్యధికంగా 32 సార్లు అధిరోహించిన నేపాలీ షెర్పా కామి రీటా ఇవాళ అభ్యర్థన చేశారు. 8849 మీటర్ల ఎత్తైన ఎవరెస్ట్ను ఎక్కేందుకు పర్వతారోహకులు అధిక సంఖ్యలో వస్తున్నారని, దీని వల్ల ఆ కొండ రద్దీగా మారినట్లు ఆయన తెలిపారు. అయితే పర్వతారోహకుల సంఖ్యపై నియంత్రణ పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈసారి చైనా వైపు నుంచి ఎవరెస్ట్ ఎక్కేందుకు అనుమతి



లేకపోవడంతో.. నేపాల్ వైపు నుంచి భారీ సంఖ్యలో పర్వతారోహకులు రిజిస్టర్ చేసుకున్నారు. బుధవారం ఒక్క రోజే నేపాల్ వైపు నుంచి 274 మంది క్లైంబర్లు ఎవరెస్ట్ చేసుకున్నారు. ఈసారి మొత్తం 494 మంది పర్వతారోహకులకు నేపాల్ అధికారులు పర్మిషన్ ఇచ్చారు.పర్వతారోహకులకు సరిపడ షెర్పాలు ఉన్నా.. ఎవరెస్ట్ పర్వతం రద్దీగా మారిపోయిందని కామి రీటా అన్నారు. అధికారులు క్లైంబర్ల సంఖ్యను కంట్రోల్ చేయాలన్నారు. ఎవరెస్ట్ శిఖరంపై రోప్ మార్గంలో ట్రాఫిక్ జామ్ కావడం వల్ల.. ఆ పర్వతారోహకులు అధిక సమయం కఠినమైన వాతావరణంలో గడపాల్సి వస్తోందని, దీని వల్ల వాళ్ల ప్రాణాలు ఇబ్బందుల్లో పడుతున్నాయన్నారు. కామి రీటాతో పోటీపడుతున్న పసాంగ్ దవా షెర్పా ఇప్పటికే ఎవరెస్ట్ను 31 సార్లు అధిరోహించారు.

## తెలంగాణ ఆవిర్భావ వేడుకల బ్రోచర్ను ఆవిష్కరించిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి


హైదరాబాద్ : మలేషియా తెలంగాణ అసోసియేషన్ , బీఆర్ఎస్ మలేషియా సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 6 న కౌలాలంపూర్లో జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ రామారావు పాల్గొంటున్న కార్యక్రమ బ్రోచర్ను మాజీ మంత్రి ,ఎమ్మెల్యే జి .జగదీశ్ రెడ్డి ఆవిష్కరించారు.తెలంగాణ సమాచారంఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా కేసీఆర్ పేరును గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ లేని లోటు రెండున్నర ఏండ్లుగా కనిపిస్తుందని వెల్లడించారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయలేక




పోతుందని, కేసీఆర్ ఇచ్చిన పథకాలనూ ఇవ్వలేక పోతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయామని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని తెలిపారు.అమెరికా దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో గతంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు డల్లాస్లో జరిగాయని వివరించారు. దేశంలో బీజేపీ పాలనలో చిన్న పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలపై అఘాయిత్యాలు చేస్తున్న నిందితులను పట్టుకునే శక్తి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభమవుతుందని, రైతులకు విత్తనాలు ,ఎరువులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని అన్నారు. రేవంత్ రెడ్డి పాత గురువు, చీకటి గురువు చెప్పినట్లు రైతులను వ్యవసాయానికి దూరం చేస్తున్నారని మండిపడ్డారురైతాంగాన్ని ముంచి వ్యవసాయ సబ్సిడీలు దోచుకోవాలనే ఆలోచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని అన్నారు.ప్రపంచ వ్యాప్తంగా ఏం జరిగిన ట్వీట్ చేసే రాహుల్ గాంధీ తెలంగాణలో మైనర్ బాలిక ఘటన పై ఎందుకు ట్వీట్ చేయ లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీనే తెలంగాణ ప్రజలకు , మహిళలకు శ్రీరామ రక్ష అని అన్నారు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ ప్రెసిడెంట్ మహేష్ బిగాల, మైటా ప్రెసిడెంట్ తిరుపతి,ఉమెన్స్ వింగ్ సుప్రియ, బీఆర్ఎస్ మలేసియా ప్రెసిడెంట్ చిట్టీ బాబు, శివ, రాష్ట్ర నాయకులు నరసింహ రెడ్డి, నంద్యాల దయాకర్ రెడ్డి, ధర్మేందర్ రెడ్డి, పడాల సతీష్, రవి యాదవ్ పాల్గొన్నారు

## ఢిల్లీ అల్లర్ల కేసు.. ఉమర్ ఖలీద్కు మధ్యంతర బెయిల్

ఢిల్లీ అల్లర్ల కేసు నిందితుడు ఉమర్ ఖలీద్కు శుక్రవారం ఢిల్లీ హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది. బెయిల్ విషయంలో అతడికి గతంలో ట్రయల్ కోర్టులో చుక్కెదురు కాగా హైకోర్టులో తాజాగా ఊరట దక్కింది. జూన్ 1-3 తేదీల మధ్య మూడు రోజుల పాటు బెయిల్ మంజూరు చేస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందిసీఏఏకు వ్యతిరేకంగా 2020లో ఢిల్లీలో జరిగిన అల్లర్లలో ఖలీద్పై యూఏపీఏ చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. ఆ ఏడాది సెప్టెంబర్లో అరెస్టైన అతడు నాటి నుంచీ జైల్లో ఉంటున్నాడు. తల్లి సర్జరీ ఉన్నందున ఆమెను చూసుకునేందుకు 15 రోజుల పాటు బెయిల్ కోరుతూ ఖలీద్ దాఖలు చేసిన పిటిషన్ను గతంలో ట్రయల్ కోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు మాత్రం ఖలీద్కు స్వల్ప ఊరట కల్పిస్తూ మూడు రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.ఈ సందర్భంగా కోర్టు ఉమర్



ఖలీద్కు పలు షరతులు విధించింది. బెయిల్పై విడుదలయ్యాక ఢిల్లీ-ఎన్సీఆర్ పరిధి దాటి వెళ్లకూడదని స్పష్టం చేసింది. అధికారులకు ఇచ్చిన అడ్రస్లోనే ఉండాలని చెప్పింది. ఆసుపత్రి మినహా మరే ఇతర ప్రాంతాలకు వెళ్లవద్దని స్పష్టం చేసింది. బెయిల్ సమయంలో ఒకే ఒక మొబైల్ నెంబర్ను వాడాలని కూడా స్పష్టం చేసింది. ఢిల్లీ పోలీసులు మాత్రం ఉమర్ ఖలీద్కు బెయిల్ను వ్యతిరేకించారు. అతడి తల్లిది సాధారణ శస్త్రచికిత్స అని పేర్కొన్నారు. పోలీసు భద్రత మధ్య తల్లిని చూసేందుకు ఖలీద్కు అనుమతిస్తే సరిపోతుందని చెప్పారు. అయితే, కోర్టు చివరకు అతడికి మూడు రోజుల బెయిల్ను మంజూరు చేసింది.

## హాస్టల్లో యువకుడి దారుణం.. అర్ధరాత్రి అమ్మాయిల గదిలోకి చొరబడి..

తనను పోలీసులకు పట్టించారన్న కోపంతో ఓ యువకుడు ఇద్దరు అమ్మాయిలపై కక్ష గట్టాడు. వారు ఉంటున్న హాస్టల్ గదిలోకి చొరబడి దారుణంగా కొట్టాడు. ఈ సంఘటన ఉత్తర్ప్రదేశ్లో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రయాగ్రాజ్కు చెందిన శుభమ్ ద్వివేది తండ్రికి శివ్కుతిలోని శంకర్ ఘాట్ ఏరియాలో గర్ల్స్ హాస్టల్ ఉంది. శుభమ్ ఆ హాస్టల్లో ఉంటున్న ఇద్దరు అమ్మాయిలను గత కొంత కాలం నుంచి వేధిస్తున్నాడు. అసభ్యకరమైన మెసేజ్లు పెట్టి హింసిస్తున్నాడు.ఈ నేపథ్యంలోనే వారిద్దరూ శివ్కుతి పోలీస్ స్టేషన్లో శుభమ్పై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వేధింపులు నిజమని తేలటంతో అతడిని అరెస్ట్ చేశారు. తను అరెస్ట్ అవ్వడానికి కారణమైన అమ్మాయిలపై శుభమ్ కక్ష పెంచుకున్నాడు. 17వ తేదీ అతడు బెయిల్ మీద విడుదలై బయటకు వచ్చాడు. బయటకు వచ్చిన రోజు రాత్రి రెండు గంటల సమయంలో పీకల దాకా మందు తాగి ఆ అమ్మాయిలకు కాల్స్, మెసెజ్లు చేశాడు. వారు వాటికి స్పందించకపోవటంతో శుభమ్ కోపం కట్టలు తెంచుకుంది.నేరుగా హాస్టల్కు వెళ్లాడు. ఆ ఇద్దరు అమ్మాయిలు ఉంటున్న గది తలుపులపై గట్టిగా కొట్టడం మొదలెట్టాడు. వారు డోర్ తెరవకపోవటంతో బయటినుంచి గడియ పెట్టేశాడు. బయటకు వచ్చే అవకాశం లేకపోవటంతో అమ్మాయిలు గట్టిగా అరవటం మొదలెట్టారు. కొద్దిసేపటి తర్వాత శుభమ్ తల్లి గది దగ్గరకు వచ్చింది. తల్లి రాగానే అతడు డోర్ ఓపెన్ చేశాడు. ఆ వెంటనే లోపలికి చొరబడి అలజడి సృష్టించాడు. వారిపై ఇష్టం వచ్చినట్లు దాడి చేశాడు.

## పోలీసులకు వైద్య సిబ్బందిచే స్క్రీనింగ్ పరీక్షలు



వరదయ్యపాలెం మే 22(శ్రీ చక్ర) స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారంవరదయ్యపాలెం ప్రాధమికఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ద్వైత ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఏఎన్ఏంలు పోలీసులకు ఎన్సీడి, సీడీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు..ఎస్సై మల్లికార్జున్, పోలీస్ కానిస్టేబుళ్లు కు బీపీ పరీక్షలు నిర్వహించి, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.నిత్యం ప్రజాసమస్యలు ప్రజలరక్షణ భద్రతా సేవలతో మానసిక ఒత్తిడి, పని ఒత్తిడికి గురవుతున్న పోలీసుల ఆరోగ్య పరిరక్షణకు ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారి ద్వైత తెలిపారుకార్యక్రమంలో ఏ ఎన్ ఎం లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో అకాల మరణం చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి వేముల నాగార్జున తండ్రిగారు చలపతికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళులు



వరదయ్యపాలెం మే 22(శ్రీ చక్ర) మృతిపై సంతాపం వ్యక్తం చేసి బాధిత నాగార్జున కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మండలంలోని చిన్నపాండురు పంచాయతీ వడ్డిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతు అకాల మరణం చెందిన ఆంధ్రజ్యోతి విలేకరి వేముల నాగార్జున తండ్రిగారు చలపతికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళులు అర్పించారు. శుక్రవారం వారి స్వగృహానికి చేరుకున్న ఎమ్మెల్య్ ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం బాధిత నాగార్జున కుటుంబాన్ని పరామర్శించి, అన్నివిధాల అండగా ఉంటామని అన్నారు.సింగిల్ విండో చైర్మెన్ ఆణిముత్యం నందకిశోర్ రెడ్డి, ఇరుగోళం జయప్రకాశ్ రెడ్డి, బత్తులవల్లనీ బాలరాజు, ఎంపీడీవో ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రసాద్, నైస్ స్కూల్ కరస్పాండెంట్ మోహన్, అంబేద్కర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు భరణి బాస్ తదితరులు పాల్గొన్నారు

## పిల్లలమర్రి పినవీరభద్ర కళాపీఠం గ్రంథాలయానికి వెయ్యి పుస్తకాలు వితరణ



రామగిరి, మే 22 : నల్లగొండ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, చరిత్రకారుడు, సిలివేరు కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు సిలివేరు లింగమూర్తి తన వ్యక్తిగత గ్రంథాలయం నుండి సాహిత్య చారిత్రక ప్రాధాన్యత కలిగిన సుమారు 1,000 గ్రంథాలను సూర్యాపేటలోని పిల్లలమర్రి పినవీరభద్ర గ్రంథాలయానికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ.. తాను జీవిత కాలంలో సంపాదించుకున్న ఈ విలువైన పుస్తకాలు భవిష్యత్ తరాలకు అందాలంటే పిల్లలమర్రి పినవీరభద్ర కళాపీఠం గ్రంథాలయం ద్వారానే సాధ్యమని భావిస్తున్నట్లు తెలిపారు. పరిశోధకులకు, పోటీ పరీక్షార్థులకు ఉపయోగపడే విలువైన గ్రంథాలు అందజేసిన సిలివేరు లింగమూర్తికి గ్రంథాలయం నిర్వాహకుడు శీల అవిలేను కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సృజన సాహితీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాగర్ల సత్తయ్య పాల్గొన్నారు.

## ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి : సబ్ కలెక్టర్ మనోజ్



తాండూర్ : వరి ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ఆదేశించారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని కార్తికేయ రైస్ మిల్లును తాండూర్ తహసీల్దార్ జ్యోత్స్న తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుంచి నిబంధనల ప్రకారం నాణ్యమైన వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. వరి కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని అధికారులను కోరారు.గోదాములకు తరలించిన వరి ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిలువ చేయాలని, తదుపరి ఆదేశాలు ప్రకారం తరలించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సబ్ కలెక్టర్ వెంట ఆర్ఐ బొలిశెట్టి పద్మజా, రెవిన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ఆళ్లగడ్డలో వేడెక్కుతున్న రాజకీయాలు

కర్నూలు, మే 22, నంద్యాల రాజకీయ గడ్డపై మరో భూమా వారసురాలి గర్జన వినిపించబోతోంది. దివంగత భూమా నాగిరెడ్డి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకుని, ఇప్పటికే ప్రజాక్షేత్రంలో చురుగ్గా ఉంటున్న భూమా మౌనిక రెడ్డి నేరుగా ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు టాలీవుడ్ హీరో, ఆమె భర్త మంచు మనోజ్ స్పష్టం చేశారు. భూమా కుటుంబం నుంచి మరో కీలక నాయకురాలు అసెంబ్లీ బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. మంచు మనోజ్ భార్య భూమా మౌనిక రెడ్డి రాబోయే ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు వెలువడిన అధికారిక ప్రకటన ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఈ దంపతులు కలిసి ప్రారంభించిన ఐక్య ధైర్య సేన సమితి కేవలం సేవా కార్యక్రమాలకే పరిమితమని చెబుతూనే, మౌనిక రాజకీయ అరంగేట్రంపై మనోజ్ క్లారిటీ ఇచ్చారు. దీంతో భూమా నాగిరెడ్డి ఆశయ సాధన కోసం మౌనిక ప్రత్యక్ష రాజకీయాల్లో తనదైన ముద్ర వేయబోతున్నట్లు స్పష్టమవుతోంది. భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డిల ద్వితీయ కుమార్తె మౌనికకు రాజకీయాలు కొత్తేమీ కాదు. భూమా నాగిరెడ్డి మరణం తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో తన సోదరి భూమా అఖిలప్రియ విజయం కోసం గర్భిణీగా ఉండి కూడా ఆమె చేసిన పాదయాత్ర, ప్రసంగాలు అప్పట్లో అందరినీ ఆకట్టుకున్నాయి. మౌనికలో ఉన్న వాగ్ధాటి, ప్రజలతో మమేకమయ్యే నైజం భూమా అనుచరుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. కేవలం ఒక సెలబ్రిటీ భార్యగానే కాకుండా, కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు అండగా నిలిచే ధైర్యవంతురాలిగా ఆమెకు పాత నంద్యాల జిల్లాలో మంచి గుర్తింపు ఉంది.ప్రస్తుతం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో భూమా అఖిలప్రియ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే మౌనిక రెడ్డి మాత్రం కేవలం తన సోదరి వెనుక ఉండిపోయే పాత్రకు భిన్నంగా, సొంతంగా తన రాజకీయ భవితవ్యాన్ని నిర్మించుకోవాలని భావిస్తున్నారు. తన తండ్రికి కంచుకోట లాంటి నంద్యాల నియోజకవర్గం లేదా సమీప ప్రాంతాల్లో ఆమె పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకోవడానికి ఐక్య ధైర్య సేన ద్వారా ఆమె చేస్తున్న పర్యటనలు ఎన్నికల ముందు బలమైన పునాదిగా మారుతున్నాయి. మౌనిక పోటీ చేయడం ఖాయమని మనోజ్ ప్రకటించినప్పటికీ, ఏ పార్టీ నుంచి బరిలోకి దిగుతారనే విషయాన్ని మాత్రం సస్పెన్స్‌గా ఉంచారు. కుటుంబ గౌరవాన్ని కాపాడుతూ, ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చే ఏ పక్షం వైపు అయినా మొగ్గు చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. భూమా మౌనిక రెడ్డి రాకతో నంద్యాల, ఆళ్లగడ్డ పాలిటిక్స్ మరింత ఆసక్తికరంగా మారబోతున్నాయి. సోదరి అఖిలప్రియతో కలిసి పని చేస్తారా లేక స్వతంత్రంగా తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకుంటారా అన్నది వేచి చూడాలి. భూమా మౌనిక రెడ్డి రాజకీయ అరంగేట్రం ఖాయమని కన్ఫామ్ అయింది. సినీ నటుడు, మౌనిక భర్త మంచు మనోజ్ తన భార్య పొలిటికల్ ఎంట్రీపై క్లారిటీ ఇచ్చారు. భూమా మౌనికకు రాజకీయాలు కొత్త కాదన్న మనోజ్..భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డి



వారసురాలిగా ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టబోతున్నట్లు ప్రకటించారు. దీంతో రాయలసీమతో పాటు కర్నూలు, ఆళ్లగడ్డ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డి దంపతులు తమ మార్క్ పాలిటిక్స్‌తో ప్రత్యేక గుర్తింపు, పేరు సంపాదించుకోవడమే కాదు..కీలక పాత్ర పోషించారు.నాగిరెడ్డి, శోభ మరణానంతరం..వారి కుటుంబంలో ఇద్దరు బిడ్డలు, కుమారుడు రాజకీయ అవకాశాల కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు బిజీగా ఉన్నారు. భూమా నాగిరెడ్డి దంపతుల రాజకీయ వారసురాలిగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన అఖిలప్రియ ఇప్పటికే రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. గత టీడీపీ ప్రభుత్వంలో మంత్రి కూడా అయ్యారు. ప్రస్తుతం ఆమె టీడీపీ తరపున ఆళ్లగడ్డ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు.భూమా నాగిరెడ్డి దంపతుల రెండో కుమార్తె, మంచు మనోజ్ సతీమణి మౌనిక కూడా ఇప్పుడు రాజకీయాలపై ఆసక్తిగా చూపిస్తున్నారు. మంచు మనోజ్ ఈ విషయాన్ని కన్ఫామ్ చేయడంతో పాటు..మౌనికది రాజకీయ కుటుంబమే అని స్పష్టం చేయడంతో భూమా మౌనికారెడ్డి పొలిటికల్ అరంగేట్రంపై రకరకాల ఊహాగానాలు స్టార్ట్ అయ్యాయి. భూమా కుటుంబంలో ఇద్దరు ఆడబిడ్డలు, ఒక సోదరుడు రాజకీయ వారసత్వం కోసం పోటీ పడే పరిస్థితి ఏర్పడిందన్న చర్చ స్టార్ట్ అయింది. అఖిలప్రియకు గతంలో మౌనిక రాజకీయంగా అండగా నిలిచి ఆమె విజయానికి సహకరించారు. వారి సోదరుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి కూడా అఖిలప్రియ వెంట నడుస్తున్నారుమౌనికా రెడ్డి రాజకీయాల్లోకి వస్తే ఆమె దారెటు అన్నది బిగ్ క్వశ్చన్‌గా మారింది. ఆమె ఎక్కడి నుంచి పోటీ చేస్తారు, ఏ పార్టీ నుంచి చేస్తారు, ఎంపీగానా లేక ఎమ్మెల్యేగానా ఇవన్నీ చర్చకు దారి తీస్తున్నాయి. మంచు మనోజ్, భూమా మౌనిక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మంచు మనోజ్ తన పుట్టినరోజు సందర్భంగా తన సతీమణి రాజకీయ రంగ ప్రవేశంపై కీలక వ్యాఖ్యలే చేశారు. కానీ తన సతీమణి మౌనిక ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వలేదు. అయితే ఈ కుటుంబం టీడీపీకి సన్నిహితంగా ఉంటోంది. తరచుగా మంత్రి నారా లోకేశ్‌తో మనోజ్ భేటీ అవుతున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీతోనే వీరి రాజకీయాలు కొనసాగుతాయా? లేక వైసీపీ, జనసేన, బీజేపీలో ఏదో ఒక పార్టీ వైపు చూస్తారా.? అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఇక భూమా కుటుంబానికి టీడీపీ, వైసీపీతో మంచి సంబంధాలే ఉన్నాయి. భూమా దంపతులు ఈ రెండు పార్టీల నుంచి ప్రజా ప్రతినిధులు అయ్యారు. దాంతో టీడీపీలో అఖిలప్రియ రాజకీయంగా స్థిరపడినందున మౌనికా రెడ్డి వేరే ప్రత్యామ్నాయలు చూసుకుంటారా అన్న చర్చ సాగుతోంది. గతంలో చిరంజీవి పెట్టిన ప్రజారాజ్యంలో పార్టీలో భూమా దంపతులు పనిచేయడంతో..మౌనిక జనసేన వైపు వెళ్లొచ్చన్న టాక్ కూడా వినిపిస్తోంది. మరోవైపు మంచు మనోజ్ ధాలు మెయింటెన్ చేస్తున్నారు. మం చు విష్ణుకు అతని భార్య తరపు న..వైసీపీ అధినేత జగన్ బంధువు అవుతారు. దీంతో మనోజ్ అటువైపు వెళ్లకపోవచ్చన్న టాక్ నడుస్తోంది ప్రస్తుతానికి అయితే భూమా మౌనికా రెడ్డి పొలిటికల్ ఎంట్రీ కన్ఫామ్ కావడంతో..కర్నూలు జిల్లా రాజకీయాల్లో ఇంట్రెస్టింగ్ డిస్కషన్ . అక్కా, చెల్లెలు ఇద్దరూ కోఆర్డినేట్ చేసుకుని రాజకీయంగా ముందుకు సాగుతా రా? లేక రాజకీయ వారసత్వం కోసం చెరో పార్టీ నుంచి ఎదురెదు రుగా పోటీ పడుతారా? అనేది చూడాలి.

# విశాఖకు నగరానికి మహర్దశ

విశాఖపట్టణం, మే 22,విశాఖ నగరాన్ని రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల మేర సెమీ రింగురోడ్డు నిర్మించనున్నారు. భోగాపురం విమానాశ్రయానికి ఏడు కనెక్టింగ్ రోడ్లు, బీచ్ కారిడార్‌తో పాటు రూ.14 వేల కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఉత్తరాంధ్రను ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మారుస్తూ ఆర్థిక కారిడార్‌ను బలోపేతం చేయడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న విశాఖపట్నం నగరాన్ని రాబోయే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రణాళికలను అమలు చేస్తోంది. వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ సమీక్షలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సుమారు 6,836 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న వీఎంఆర్డీఏ పరిధిని మరింత పటిష్టం చేస్తూ.. నగరం నలుమూలలా విస్తరించేలా చర్యలు చేపట్టారు.విశాఖ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, పారిశ్రామిక ప్రాంతాలను అనుసంధానించడానికి రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కిలోమీటర్ల పొడవైన సెమీ రింగురోడ్డును ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ఈ నెలాఖరు నాటికి సిద్ధం కానుంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే.. నగరం మధ్యలోకి భారీ వాహనాలు రాకుండా నేరుగా హైవేలకు అనుసంధానం అయ్యే అవకాశం ఉంటుంది. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా నగర శివారు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి.నిర్మాణంలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రాధాన్యతనిస్తూ.. దానికి ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు రోడ్ల నిర్మాణం పూర్తి కాగా.. మిగిలినవి తుది దశలో ఉన్నాయి. విశాఖ నగరం నుంచి భోగాపురం వరకు పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేలా ప్రత్యేక బీచ్ కారిడార్‌ను కూడా ప్రతిపాదించారు. ఇది పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించడమే కాకుండా సముద్ర తీర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడుతుంది. నగరవాసుల ప్రాథమిక అవసరాలను తీర్చేందుకు రూ.14 వేల కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే విశాఖలోని 95 శాతం ఇళ్లకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని మంత్రి నారాయణ వివరించారు. అలాగే మాస్టర్ ప్లాన్ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన 90 శాతం వినతులను అధికారులు పరిష్కరించారు. ఉత్తరాంధ్రను ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మార్చడమే లక్ష్యంగా.. విశాఖ ఎకనామిక్ కారిడార్‌ను బలోపేతం చేస్తూ ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్ రంగాలకు పెద్దపీట వేస్తున్నారు. ఈ సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు విశాఖను గ్లోబల్ సిటీగా కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు వెల్లడించారు.

# ఎట్టకేలకు నెరవేరిన కోరిక

## 12 ఏళ్ల తర్వాత మోక్షం

విశాఖపట్టణం, మే 22, ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది.. ఎట్టకేలకు రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకుంది. విశాఖపట్నం కేంద్రంగా కొత్తగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కొత్త రైల్వే జోన్ 2026 జూన్ 1 నుంచి అధికారికంగా అమల్లోకి వస్తుందని కేంద్రం పేర్కొంది. విశాఖ జోన్ పరిధిలోకి విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ, గుంతకల్లు డివిజన్లు వచ్చేశాయి. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో కొత్త రైల్వే డివిజన్ రాయగడ కేంద్రంగా ఏర్పాటైంది.. వాల్తేరు డివిజన్‌ను విభజించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే కింద రాయగడ కేంద్రంగా ఏర్పాటయ్యే కొత్త డివిజన్ పనిచేస్తుందని తెలిపారు. గత నెల 28న విశాఖపట్నంలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ విశాఖ కొత్త రైల్వే జోన్ ఏర్పాటుపై ప్రకటన చేశారు. జూన్ 1 నుంచి నోటిఫై చేస్తామన్నారు.. చెప్పినట్లుగానే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.తాజాగా గెజిట్ విడుదల చేయడంతో.. ఇకపై దక్షిణ మధ్య రైల్వే పరిధిలో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు మాత్రమే ఉంటాయి. అలాగే మొన్నటి వరకు ఖుర్దా రోడ్ డివిజన్‌లో ఉన్న ఇచ్ఛాపురంటు పలాస రైలు మార్గం విశాఖపట్టణం డివిజన్‌కు బదిలీ చేశారు. అలాగే రాయచూర్ - వాడి సెక్షన్‌ను గుంతకల్ డివిజన్ నుంచి సికింద్రాబాద్ డివిజన్‌కు మార్చారు. గుంటూరు డివిజన్‌లో ఉన్న పగిడిపల్లి - విష్ణుపురం మార్గం సికింద్రాబాద్ డివిజన్‌కు బదిలీ చేశారు. సికింద్రాబాద్ డివిజన్‌లో ఉన్న కొండపల్లి - మోటుమర్రి మార్గాన్ని విజయవాడ డివిజన్‌కు మార్చారు. సింగపూర్ రోడ్ - విజయనగరం రాయగడ, విశాఖపట్టణం డివిజన్ల మధ్య కొత్త సరిహద్దుగా ఫిక్స్ అయ్యింది. రైల్వే బోర్డు సౌత్ కోస్ట్, ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజన్ల మధ్య సరిహద్దుల వివరాలను గెజిట్‌లో పేర్కొంది. జూన్ 1, 2026 నుంచి కొత్త రైల్వే జోన్‌తో పాటుగా ఈ మార్పులు అమల్లోకి వస్తాయి.ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. చివరికి 2019 ఫిబ్రవరిలో కొత్త జోన్ ఏర్పాటు చేయడంపై ప్రకటన చేశారు.. ఆ తర్వాత ఎలాంటి ప్రకటన రాలేదు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంతో సంప్రదింపులు జరిపింది. చివరికి 2025 జనవరిలో కేంద్రం డీపీఆర్‌కు ఆమోదం తెలపగా.. ఆ వెంటనే ప్రధాని మోదీ విశాఖపట్నం వచ్చిన మమయంలో రైల్వే జోన్ కార్యాలయం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అలాగే కొత్త రైల్వే జోన్‌కు అవసరమైన అధికారుల్ని ఇప్పటికే నియమించారు. అలాగే ఇతర రైల్వే డివిజన్ల నుంచి కొత్త విశాఖపట్నం జీఎం ఆఫీసులో పనిచేయడానికి ఆప్షన్లు కోరగా.. ఏకంగా 3వేలమంది ఆసక్తి కనబరిచారు.

# రామ్మోహననాయుడుకు పదవీ గండం...

శ్రీకాకుళం, మే 22, కేంద్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న బలమైన చర్చ నడుస్తోంది. నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళు సమీపిస్తోంది. ఈ తరుణంలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. కొత్త టీం రావడంతో పాటు కొందరి మంత్రుల ఉద్వాసన ఉండబోతుందన్న టాక్ కూడా ఉంది. కొందరి మంత్రి పదవులు చేర్పులు మార్పులు ఖాయమన్న చర్చ నడుస్తోంది. అందులో భాగంగా ఏపీ నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు శాఖ మార్పు ఉంటుందన్న టాక్ నడుస్తోంది. పౌర విమానయాన శాఖ నుంచి ఆయనకు వేరే శాఖకు బదిలీ చేస్తారని కూడా తెలుస్తోంది. పౌర విమానయాన శాఖ పరిధిలో ఇటీవల జరిగిన పరిణామాలతో రామ్మోహన్ నాయుడు మార్పు అనివార్యం అని సమాచారం. అయితే రామ్మోహన్ నాయుడుకు ఏ శాఖ ఇస్తారు అనేది ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది.శ్రీకాకుళం ఎంపీగా మూడోసారి విజయం సాధించిన కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్ర క్యాబినెట్ లోకి తీసుకున్నారు. ఎన్డీఏలో తెలుగుదేశం కీలక భాగస్వామి కావడంతో రామ్మోహన్ నాయుడుకు కీలకమైన పౌర విమానయాన శాఖ దక్కింది. అయితే పౌర విమానయాన శాఖ అనేది ఇప్పటికే ప్రైవేటీకరణ ఎక్కువగా జరిగింది. దీంతో ఆ శాఖ పరిధిలో చేసే అవకాశం ఏదీ లేదు. 2014లో కూడా ఎన్డీఏలో కీలక భాగస్వామ్యం పార్టీగా టిడిపి ఉండేది. ఆ సమయంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా అశోక్ గజపతిరాజు వ్యవహరించేవారు. 2018లో టిడిపి ఎన్ డి ఏ కు గుడ్ బై చెప్పిన తర్వాత ఆ పదవిని వదులుకున్నారు అశోక్ గజపతిరాజు. దానిని కొనసాగింపుగా రామ్మోహన్ నాయుడుకు ఆ పదవి దక్కింది. అయితే పౌర విమానయాన శాఖలో నిత్యం ఏదో ఒక వివాదం జరుగుతూనే ఉంది. దీంతో అది రామ్మోహన్ నాయుడుకు మైనస్ గా మారింది. అందుకే ఆయన శాఖ మార్పు ఉంటుందన్న టాక్ మొదలైంది.రామ్మోహన్ నాయుడుకు కొత్తగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా అవకాశం దక్కే ఛాన్స్ కనిపిస్తోంది. ఎందుకంటే ఆ పదవిని ఆయన తండ్రి కింజరాపు ఎర్రం నాయుడు నిర్వర్తించారు. 1996 సమయంలో జాతీయస్థాయిలో కూటమి ప్రభుత్వాలు నడుస్తుండేవి. ఆ సమయంలో టిడిపి కీలకంగా ఉండేది. అందుకే ఎర్రం నాయుడుకు గ్రామీణాభివృద్ధి శాఖతోపాటు పంచాయతీరాజ్ శాఖ దక్కింది. ఒక విధంగా ఉమ్మడి రాష్ట్రంలో ఎర్రం నాయుడు ప్రాబల్యం ఆశాఖ ద్వారానే పెరిగింది. ఇప్పుడు మరోసారి రామ్మోహన్ నాయుడుకు అదే శాఖ కేటాయిస్తారని పొలిటికల్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# కూటమి వైపు చూస్తున్న వైసీపీ నేతలు



విజయవాడ, మే 22, ఏపీలో రాజ్యసభ పదవుల సందడి మొదలైంది. నలుగురు పదవీ విరమణ చేయనున్నారు. ఆ నాలుగు పదవులు కూటమికి దక్కనున్నాయి. అయితే రాజ్యసభ పదవులకు ముగ్గురు వైసీపీ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. అందులో ఇద్దరు పరిస్థితి ఏంటనేది తెలియాల్సి ఉంది. వారిద్దరూ తెలుగుదేశం పార్టీలో చేరుతారన్న ప్రచారం నడుస్తోంది. అందులో ఒకరు బిజెపి లోకి వెళ్లిన ఆశ్చర్యపోనవసరం లేదన్న టాక్ నడుస్తోంది. ప్రధానంగా పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి చుట్టూ ఇప్పుడు కొత్త ప్రచారం మొదలైంది. ఇందులో సుభాష్ చంద్రబోస్ టిడిపి వైపు.. ఆళ్ల అయోధ్య రామిరెడ్డి బిజెపి వైపు వెళ్తారని పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. వచ్చేనెల 21తో వారి రాజ్యసభ పదవీకాలం ముగియనుంది. వారి స్థానంలో కొత్త వారి ఎంపిక కోసం ఈరోజు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది.ఏపీ నుంచి ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళనత్వాని, సానా సతీష్ పదవి విరమణ చేయనున్నారు. ఇందులో సతీష్ టీడీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు. ఏడాది కిందట ఆయనకు రాజ్యసభ పదవి దక్కింది. ఆ సమయంలోనే మరోసారి రెన్యువల్ చేస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు పరిమళానత్వాన్ని బిజెపి కోటాలో అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అవకాశమిచ్చింది. అయితే ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తో పాటు పిల్లి సుభాష్ చంద్రబోస్ రాజకీయ అడుగులు ఎటు వేస్తారా అనే చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఆ ఇద్దరు నేతలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే వైసీపీకి గుడ్ బై చెబుతారని ప్రచారం సాగుతోంది.ఆది నుంచి ఆళ్ల ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉంటూ వస్తోంది. పార్టీకి అండదండగా నిలుస్తూ వచ్చారు అయోధ్య రామిరెడ్డి. ఆయన స్వతహాగా పారిశ్రామికవేత్త కూడా. జగన్మోహన్ రెడ్డి పార్టీ ఏర్పాటు చేసిన నాటి నుంచి ఆయన వెంట అడుగులు వేస్తారు. అందుకే జగన్ ఆయనకు సుదీర్ఘకాలం రాజ్యసభ పదవి కట్టబెట్టారు. ఆయన సోదరుడు ఆళ్ళ రామకృష్ణారెడ్డికి మంగళగిరి టిక్కెట్ ఇచ్చారు రెండుసార్ల. రామకృష్ణారెడ్డి రెండుసార్లు కూడా విజయం సాధించారు. 2024 ఎన్నికల్లో మాత్రం మొండి చేయి చూపారు. అప్పటినుంచి ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పార్టీపై అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. ఇప్పుడు రాజ్యసభ పదవీకాలం ముగియడంతో ఏదో ఒక నిర్ణయానికి వస్తారని పొలిటికల్ వర్గాల్లో టాక్ ఉంది.పిల్లి సుభాష్ చంద్రబోస్ ది అదే పరిస్థితి. ఆయన కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం కొనసాగుతూ మంత్రిగా కూడా వ్యవహరించారు. తర్వాత జగన్ వెంటే అడుగులు వేశారు. ఆ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. అందుకే జగన్ ఆయనకు రాజ్యసభ అవకాశము ఇచ్చారు. మొన్నటి ఎన్నికల్లో ఆయన కుమారుడికి టికెట్ అడిగితే జగన్ నిరాకరించారు. అప్పటినుంచి అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం నడిచింది. ఇప్పుడు భవిష్యత్తులో కుమారుడికి వైసీపీ టికెట్ దక్కేలా లేదు. ఆయన సీరియస్ గా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. టిడిపి వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. మొత్తానికైతే ఇద్దరు రాజ్యసభ పదవులు వదులుకున్న తర్వాత వైసీపీకి గుడ్ బై చెబుతారన్న టాక్ నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# కోనేటి కాల్వ వీధిలో యువకుడిపై ఇద్దరు వ్యక్తులు దాడి.

ప్రొద్దుటూరు...., కోనేటి కాల్వ వీధిలో షేక్ అఫ్జల్ అనే యువకుడిపై అదే వీధికి చెందిన యూసుఫ్ మరియు హుస్సేన్ లు సిమెంటు ఇటుకలతో తలపై కొట్టడం వలన రక్త గాయాలు అయినవి. అఫ్జల్ పిన్ని కుమారుడిని యూసఫ్ అనే వ్యక్తి తన ఇంటి వద్ద చిన్న పని ఉందని బలవంతంగా పిలుచుకొని పోయినాడు అని, అంతట అఫ్జల్ యొక్క కుటుంబ సభ్యులు ఆ పిల్లవాడి ఆచూకీ కోసం వెతకగా యూసుఫ్ పీల్చుకొని పోయినాడు అని తెలిసి అతన్ని ఎందుకు పిల్లవాణ్ణి పిలుచుకెళ్ళావని అడిగినందుకు యూసుఫ్ మరి అతని సోదరుడు హుస్సేన్ ఇద్దరు దాడి చేసి అఫ్జల్ ను గాయపరచడమైనది. దీనికి సంబంధించి ప్రొద్దుటూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఎస్సై మధుసూదన్ రెడ్డి కేసు నమోదు చేసి ఆ ఇద్దరు దాడి చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

# బెజవాడలో జీప్‌లతో ఢీకొట్టుకొన్న యువకులు

ఎదురెదురుగా దూసుకొస్తూ...వారిద్దరూ చిన్ననాటి నుంచి ప్రాణ స్నేహితులు. ఓ యువతి వ్యవహారంలో మనస్పర్థలు తలెత్తాయి. ఇది కాస్త ముదిరి.. నడిరోడ్డుపై వాహనాలతో ఢీకొట్టుకునే వరకు వెళ్లింది. అవి ధ్వంసమైనా.. పగ, కసి చల్లారక.. దిగి కలియబడ్డారు. ఈ ఘటన చూసి.. రోడ్డుపై వెళుతున్న వారు భయంతో పరుగులు పెట్టారు. ఫ్యాక్షన్ సినిమాలోని పతాక సన్నివేశాలకు ఏమాత్రం తీసిపోని ఈ ఘటన విజయవాడలో హైటెన్షన్ రోడ్డులో గురువారం రాత్రి జరిగింది..సవాళ్లు విసురుకుని.. తాడిగడపకు చెందిన లింగమనేని రోహిత్ ఇంజినీరింగ్ విద్యార్థి.విజయవాడలోని భారతీనగర్‌కు చెందిన బోల్లా ఓమ్.. తన తండ్రితో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చూసుకుంటున్నాడు. ఇతను వైకాపా నేత జోగి రమేష్‌కు బంధువుగా చెప్పుకొనేవాడు. జగన్ పుట్టిన రోజును కూడా తాడేపల్లిలో తాను చదివే ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఘనంగా చేశాడు. వాహనాలతో భారీ ర్యాలీ

## పరుగులు తీసిన జనం

## యువతి వ్యవహారంలో మనస్పర్థలే కారణం

నిర్వహించాడు. ఓమ్, రోహిత్ ఇద్దరూ చిన్ననాటి నుంచి స్నేహితులు. ఓ యువతి వ్యవహారంలో ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో రోహిత్‌కు ఓమ్ ఫోన్ చేశాడు. ఎక్కడ ఉన్నావని ప్రశ్నించాడు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. తాను పటమట ఆర్‌ఆర్ గార్డెన్‌లోని హైటెన్షన్ రోడ్డులో ఉన్నానని చెప్పాడు. ఇద్దరు ఒకరికొకరు సవాళ్లు విసురుకున్నారు.ఒకదానికొకటి ఢీకొట్టుకుంటూ..ఓమ్.. తన థార్ జీప్‌పై రోహిత్ ఉన్న ప్రాంతానికి గురువారం రాత్రి వెళ్లాడు. రోహిత్ జీప్‌ను ఢీకొట్టాడు. ఆగ్రహంతో ఇద్దరూ పరస్పరం రోడ్డుపైనే పలుసార్లు ఒకరి వాహనాన్ని మరొకరు బలంగా ఢీకొట్టుకున్నారు. ఇలా ఢీకొట్టుకుంటూ సుమారు 100 మీటర్లు రోడ్డుపై ఈడ్చుకుంటూ హడావుడి చేశారు. యాక్షన్ సీన్లను తలపించేలా ఢీకొట్టుకున్నారు. అటుగా వెళ్తున్న ప్రజలు.. భీతావహ దృశ్యాలను చూసి భయాందోళనలతో పరుగులు తీశారు. అప్పటికీ ఇద్దరూ వెనక్కి తగ్గలేదు. జీప్‌లు దిగి రాళ్లతో మళ్లీ కారు అద్దాలను పగలకొట్టుకున్నారు. సంబంధించి సమీపంలోని పటమట పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు.

# నయా స్టైల్ లో పప్పులుసు కర్రీ.. ఇదొక్కడి యాడ్ చేస్తే టేస్ట్ డబుల్..!



రోజూ చేసుకునే వంటకాల్లో పప్పు కచ్చితంగా ఉంటుంది. పప్పు లేదా పప్పు చారు, సాంబార్ ఇలా రోజూ ఏదో ఒకటి ఉండాల్సిందే. ముఖ్యంగా వేసవిలో పప్పు చారు ఎక్కువగా చేసుకుంటారు. త్వరగా జీర్ణం కావడంతోపాటు శరీరానికి సరిపడా శక్తిని ఇస్తుంది. అయితే పప్పులుసును ఇలా కొత్త పద్ధతిలో ఎప్పుడైనా ట్రై చేశారా..? ఇలా చేస్తే పప్పులుసు సూపర్ టేస్టీగా ఉంటుంది. రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం.. సూపర్ టేస్ట్ గా ఉండే పప్పులుసును ఎలా తయారు చేసుకోవాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? ఇంట్లోనే ఈజీగా ఈ పప్పులుసు తయారీ విధానం ఇక్కడ చూడండి..పప్పులుసు తయారీ విధానం చూస్తే ముందుగా కావాల్సిన పదార్థాలు తీసుకోవాలి. కందిపప్పు ఒక కప్పు, టమాటోలు రెండు ముక్కలుగా కట్ చేసినవి, ఉల్లిపాయలు రెండు సన్నగా తరిగినవి, పచ్చిమిర్చి నాలుగు లేదా ఐదు, చింతపండు పులుసు అర కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ ఒక టేబుల్ స్పూన్, పసుపు అర టేబుల్ స్పూన్, కారం ఒక టేబుల్ స్పూన్, ఉప్పు రుచికి సరిపడా, నూనె రెండు టేబుల్ స్పూన్ లు, తాలింపు గింజలు.. ఆవాలు, జీలకర్ర, ఎండు మిర్చి, కరివేపాకు తీసుకోవాలి.ఇప్పుడు పప్పులుసు తయారీ విధానం చూస్తే ముందుగా పప్పును కడిగి టమాటోలతో కలిపి పసుపు వేసి ఉడికించుకోవాలి. ఆ తర్వాత బాణలిలో నూనె వేడి చేసి తాళింపు పదార్థాలు, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి వేయించుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమంలో ఉడికిన పప్పు, కారం, చింతపండు పులుసు పోయాలి. అలా మరిగించుకోవాలి. ఆ తర్వాత రుచికి తగినంత ఉప్పు వేసి మరికొంతసేపు ఉడికించుకోవాలి. చివరగా కొత్తిమీర గార్నిష్ చేసుకుని దింపుకుంటే సరి.. సూపర్ టేస్టీ పప్పులుసు రెడీ అయినట్టే.. ఈ పప్పులుసును వేడి వేడి అన్నంలో తింటే ఆ టేస్టే వేరుగా ఉంటుంది.

# ఆకుకూరలు, టమాటా మిక్సిడ్ పచ్చడి..

## ఇలా చేసి తింటే రుచి అదుర్స్!



రుచికరమైన , ఆరోగ్యకరమైన ఇంటి పచ్చడి తినాలని ఎవరు మాత్రం కోరుకోరు. బయట కొనుక్కున్న పచ్చళ్ళు, నిల్వ పచ్చళ్ళ కంటే అప్పటికప్పుడు చేసుకుని తినే పచ్చళ్ళు చాలా మంచివి. ముఖ్యంగా ఆకుకూరలు తిననివారు వాటిని పచ్చడిగా చేసి పెడితే ఇష్టంగా తింటారు.

**ఆకుకూరలు మరియు టమాటాలతో మిక్సిడ్ పచ్చడి**

మనకు ఏ సీజన్ అయినా ఆకుకూరలు దొరుకుతాయి. ఆకుకూరలు మరియు టమాటాలను కలిపి తయారు చేసే ఈ మిక్సిడ్ పచ్చడి అన్నం, రోటి, దోస, ఇడ్లీలతో అద్భుతంగా ఉంటుంది. రుచి మాత్రమే కాకుండా, పోషకాలు కూడా సమృద్ధిగా ఉండే ఈ పచ్చడి ఇంట్లో సులభంగా తయారు చేసుకోవచ్చు.మిక్సిడ్ ఆకుకూరలు, టమాటాల **పచ్చడికి కావాల్సిన పదార్థాలు**

ఆకుకూరలు పాలకూర– అర కట్ట తోటకూర– అర కట్ట చుక్కకూర – అర కట్ట టమాటాలు: 4–5 (పండినవి) పచ్చి మిర్చి: 15 (మంటకు తగ్గట్టు) వెల్లుల్లి రెబ్బలు: 8–10 ఉప్పు: తగినంత నూనె: 2–3 టేబుల్ స్పూన్లు జీలకర్ర: 1 టీస్పూన్ ఆవాలు:½ టీస్పూన్ ఎండు మిర్చి – 3 కరివేపాకు: 1–2 రెమ్మలు

**తయారీ విధానం**

ముందుగా ఆకుకూరలను బాగా కడిగి, కాడలు తీసివేసి, సన్నగా తరగాలి. టమాటాలను కడిగి ముక్కలుగా కోయాలి. ఆపై స్టవ్ వెలిగించి ఒక పాన్‌లో 2 టేబుల్ స్పూన్ల నూనె వేడి చేసి అందులో కట్ చేసుకున్న ఆకుకూరలు, టమాటాలు, పచ్చి మిరపకాయలు వేసి వేయించాలి. ఆకుకూరలు మెత్తబడి, టమాటాలు, పచ్చిమిర్చి పూర్తిగా ఉడికిన తర్వాత మంట ఆపేయాలి.


**పచ్చడి ఇలా చేస్తే సూపర్ రుచి**

మిశ్రమం పూర్తిగా చల్లారాక మిక్సీలో ఆకుకూరలు, పచ్చి మిర్చి, టమాటాలు ఉడికిన మిశ్రమం వేసి రుచికి సరిపడా ఉప్పు వేసి, ఒక స్పూన్ జీలకర్ర, 10వెల్లుల్లి రెబ్బలు, కొద్దిగా కరివేపాకు వేసి బాగా మెత్తగా కాకుండా గ్రైండ్ చేసుకోవాలి. ఒక చిన్న పాన్‌లో నూనె వేడి చేసి, ఆవాలు, వెల్లుల్లి, ఎండుమిర్చి, కరివేపాకు వేసి తాలింపుచేసి పచ్చడిలో పోసి కలపాలి. అంతే రుచికరమైన ఆకుకూరలు, టమాటాల పచ్చడి సిద్ధం అవుతుంది.

మామిడిపండ్ల సీజన్ అని జ్యూస్ లు తెగ తాగేస్తున్నారా? ఇది మీ కోసమే!

**మిక్సిడ్ ఆకుకూరలు, టమాటాల పచ్చడికి ముఖ్యమైన చిట్కాలు**

ఈ పచ్చడి రుచిగా ఉండాలంటే ఆకుకూరలు తాజాగా ఉండాలి. ఎక్కువ నూనె వేస్తే పచ్చడి రుచి మరింత బాగుంటుంది మరియు ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. కారం తినగలవారు మంట ఎక్కువగా కావాలంటే పచ్చి మిర్చి ఎక్కువ వేయవచ్చు. ఫ్రిజ్‌లో ఉంచితే 4–5 రోజులు పచ్చడి తాజాగా ఉంటుంది. ఆకుకూరలు టమాటా మిక్సిడ్ పచ్చడి తయారు చేయడం చాలా సులభం మరియు అత్యంత ఆరోగ్యకరం. ఇంట్లో ఒక్కసారి చేస్తే అన్నం రుచి రెట్టింపు అవుతుంది. ఎప్పుడూ తిననంత ఈ పచ్చడితో కచ్చితంగా తింటారు.





# చపాతీ న్యూడిల్స్ ఎప్పుడైనా ట్రై చేశారా..?

ఇంట్లో రాత్రి మిగిలిపోయిన చపాతీలను చాలామంది మళ్లీ తినడానికి ఇష్టపడరు. అలాంటి చపాతీలతో ఎంతో రుచికరంగా, ఆరోగ్యకరంగా చపాతీ నూడుల్స్ తయారు చేసుకోవచ్చు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ నచ్చే ఈ వంటకం ఉదయం అల్పాహారంగా, సాయంత్రం స్నాక్‌గా లేదా లైట్ డిన్నర్‌గా కూడా బాగా సరిపోతుంది. మార్కెట్‌లో దొరికే మైదా నూడుల్స్ కంటే ఇది ఆరోగ్యానికి మంచిది. పైగా కేవలం 10 నిమిషాల్లోనే తయారవుతుంది.

అలానే వీటిలో చీజ్ తురుము, పనీర్ ముక్కలు లేదా ఉడికించిన మొక్కజొన్న గింజలు వేసుకుంటే పిల్లలు మరింత ఇష్టంగా తింటారు. కొద్దిగా వెన్న కలిపితే రెస్టారెంట్ స్టైల్ టేస్ట్ వస్తుంది. ఆరోగ్యకరంగా చేయాలంటే ఎక్కువ కూరగాయలు వేసుకోవచ్చు. మైదా నూడుల్స్‌తో పోలిస్తే చపాతీ నూడుల్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కూరగాయలు కలపడం వల్ల విటమిన్లు, ఖనిజాలు కూడా శరీరానికి అందుతాయి. మిగిలిపోయిన ఆహారాన్ని వృథా చేయకుండా రుచికరమైన కొత్త వంటకంగా మార్చుకోవడానికి ఇది మంచి మార్గం.

చపాతీలు – 3 లేదా 4
నూనె – 2 నుంచి 3 స్పూన్లు
వెల్లుల్లి తరుగు – 1 స్పూన్
పచ్చిమిర్చి – 2
ఉల్లిపాయ – 1 (సన్నగా తరిగినది)
క్యారెట్ – 1 చిన్నది
క్యాబేజీ – కొద్దిగా





క్యాప్సికం – అర కప్పు
స్ప్రింగ్ ఆనియన్ లేదా కొత్తిమీర – అలంకరణకు
సోయా సాస్ – 1 స్పూన్
రెడ్ చిల్లీ సాస్ – 1 స్పూన్
గ్రీన్ చిల్లీ సాస్ – 1 స్పూన్
టమాటా సాస్ – 1 స్పూన్
ఉప్పు – తగినంత
మిరియాల పొడి లేదా కారం – అర స్పూన్
చిటికెడు గరం మసాలా (ఐచ్ఛికం)

**తయారీ విధానం..**

ముందుగా చపాతీలను ఒకదానిపై ఒకటి పెట్టి గట్టిగా రోల్ చేయాలి. తరువాత వాటిని కత్తితో సన్నని పొడవాటి ముక్కలుగా కట్ చేస్తే నూడుల్స్‌లా తయారవుతాయి.ఇలా కట్ చేసిన చపాతీలను ఒక ప్లేట్‌లో పక్కన పెట్టుకోవాలి.ఇప్పుడు స్టౌపై ఒక పాన్ పెట్టి నూనె వేయాలి. నూనె వేడెక్కిన తర్వాత వెల్లుల్లి తరుగు, పచ్చిమిర్చి వేసి మంచి వాసన వచ్చే వరకు వేయించాలి. ఆ తర్వాత ఉల్లిపాయలు వేసి స్వల్పంగా గోధుమరంగు వచ్చే వరకు కలుపుతూ వేపాలి.తర్వాత క్యారెట్, క్యాబేజీ, క్యాప్సికం ముక్కలను వేసి హై ఫ్లేమ్‌పై రెండు నుంచి మూడు నిమిషాలు వేయించాలి. కూరగాయలు పూర్తిగా మెత్తబడకుండా కొద్దిగా క్రంచీగా ఉంటేనే చపాతీ నూడుల్స్ రుచిగా ఉంటాయి.ఇప్పుడు సోయా సాస్, రెడ్ చిల్లీ సాస్, గ్రీన్ చిల్లీ సాస్, టమాటా సాస్ వేసి బాగా కలపాలి. తరువాత ఉప్పు, మిరియాల పొడి లేదా కారం చల్లి మరో నిమిషం కలుపుతూ వేయించాలి.చివరగా ముందుగా కట్ చేసి పెట్టుకున్న చపాతీ స్ట్రిప్స్‌ను పాన్‌లో వేసి, సాస్ మరియు కూరగాయలు అన్నీ చపాతీలకు బాగా పట్టేలా టాస్ చేయాలి.

రెండు నిమిషాలు హై ఫ్లేమ్‌పై కలుపుతూ వేయిస్తే చపాతీ నూడుల్స్ అద్భుతమైన రుచితో సిద్ధమవుతాయి.

# అల్లం టీ , లెమన్ టీ.. ఆరోగ్యానికి ఏది మంచిది..!!



టీ తాగటం ప్రతీ ఇంటా సాధారణం. చాలా మందికి ఉదయం లేవగానే టీ లేకుండా రోజు ప్రారంభం కాదు. ఉదయం నుంచి రాత్రి వరకు పలు సందర్భాల్లో టీ తాగేవారు చాలా మంది కనిపిస్తారు. ఆరోగ్యం పైన అవగాహన పెరుగుతున్న కొద్దీ టీ తీసుకునే వారి అభిరుచుల్లోనూ మార్పు కనిపిస్తోంది. చాలా మంది ఈ మధ్య కాలంలో అల్లం టీ.. లెమన్ టీ వైపు ఆసక్తి చూపుతున్నారు. గ్రీన్ టీ వినియోగం బాగా పెరిగింది. దీంతో.. అసలు ఆరోగ్య పరంగా అల్లం టీ.. లెమన్ టీ ల్లో ఏది ఎవరికి మంచిదనే సందేహాలకు నిపుణులు స్పష్టత ఇస్తున్నారు.ప్రతీ ఇంటి టీ వినియోగం పెరుగుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు టీ అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో కామన్ అయిపోయింది. సాధారణ టీ కంటే ఈ మధ్య కాలంలో అల్లంటీ, లెమన్ టీ తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ సమయంలో ఈ రెండు రకాల టీల కోసం ఎక్కువ సంఖ్యలో మొగ్గు చూపుతున్నారు. అల్లంలో ఉండే జింజెరాల్స్ శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. కీళ్ల నొప్పులు, మోకాళ్ల వాపు, గొంతు నొప్పి లేదా దగ్గు ఉన్నప్పుడు ఉదయాన్నే అల్లం టీ తాగడం శరీరానికి ఉపశమనంగా మారుతుంది. అదే విధంగా భోజనం తర్వాత లేదా ఉదయాన్నే తాగితే అజీర్తి, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. వాపును తగ్గించడంలోనూ సహాయపడుతుంది. అదే విధంగా అల్లం టీ శీతా కాలంలో శరీర వేడిని తగ్గించి...శరీరానికి శక్తిని అందిస్తుందని చెబుతున్నారు. కాగా..

నిమ్మకాయలో విటమిన్–సి పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరాన్ని లోపల నుండి శుభ్రం చేస్తుంది. బరువు తగ్గాలనుకునేవారికి లెమన్ టీ బెస్ట్ ఆప్షన్ గా స్పష్టం చేస్తున్నారు.నిపుణుల సూచనలుఅయితే, ఇక్కడే నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. పని ఒత్తిడిలో ఉన్నవారికి లెమన్ టీ వాసన మనసును ప్రశాంతంగా చేస్తుంది. శరీరంలోని విషతుల్యాలు బయటకు పంపేందుకు దోహదం చేస్తుంది. దీని ద్వారా చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ఉద్యోగాల్లో.. ఇతర సమస్యల్లో ఒత్తిడి.. అలసటగా ఉన్న సమయంలో లెమన్ టీ మూలు చేస్తుంది. ఆలోచనల ను ఫ్రెష్ గా మార్చేందుకు దోహద పడుతుంది. జలుబు, అలసట, అజీర్తి సమస్య ఉంటే అల్లం టీ. బరువు తగ్గడం, మానసిక చురుకుదనం, చర్మ శ్రేయస్సు కోసం లెమన్ టీని తీసుకోవచ్చని నిపుణులు తెలుపుతున్నారు. తయారీలో చేసే సాధారణ తప్పు చాలామంది టీని గంటల తరబడి మరిగిస్తూ ఉంటారు. ఇలా మరిగించటం ద్వారా అల్లం.. నిమ్మలోని ఔషధ గుణాలు తగ్గిపోతాయి. నీటిని మరిగించాక అల్లం తురుము లేదా నిమ్మరసం వేసి రెండు నిమిషాలు మూత పెట్టి ఉంచడం ద్వారా పోషకాలు అందులోని ఉండిపోతాయి. వయసు.. సమస్యల ఆధారంగా ఏ టీ తాగాలో ఎంపిక చేసుకోవటం ఉత్తమమని నిపుణులు వెల్లడిస్తున్నారు.



# మామిడిపండ్ల సీజన్ అని జ్యూస్ లు తెగ తాగేస్తున్నారా? ఇది మీ కోసమే!

వేసవి సీజన్లో అందరూ బాగా ఇష్టంగా తినే పండ్లు మామిడి పండ్లు. అటువంటి మామిడి పండ్లలో ఫుల్ పోషకాలు ఉంటాయి. మామిడి పండ్లు కేవలం రుచి మాత్రమే కాదు ఎన్నో మంచి చేసే గుణాలు, ఎన్నో పోషకాలతో నిండి ఉంటాయి. అటువంటి మామిడి పండ్లను తినే విషయంలో కాస్త జాగ్రత్తలు పాటించాలి. బాగా పోషకాలు ఉన్నాయని ఎక్కువగా తింటే కష్టం మీకే.. ఎక్కువ జ్యూసులు తాగినా నష్టం మీకే. ఆరోగ్యం పై మామిడి పండ్ల ప్రభావం మామిడిపండ్ల లో విటమిన్ ఏ, విటమిన్ సి, ఫైబర్ తోపాటు అనేక రకాల పోషకాలు ఉంటాయి. మామిడి పండు మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. మామిడిపండు మన జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మామిడి పండు చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. మామిడి జ్యూస్ వీరికి చాలా డేంజర్ మామిడిపండును చాలామంది జ్యూస్ గా చేసుకుని తాగుతూ ఉంటారు. మామిడి పండుతో మిల్క్ షేక్ తయారు చేసుకుని తాగేవారు కూడా లేకపోలేదు. వేసవిలో చాలామంది మామిడిపండు జ్యూస్ ను ఇష్టంగా తాగుతారు. అయితే కొన్నిరకాల అనారోగ్య సమస్యలతో బాధపడేవారు మామిడిపండు జ్యూస్ తాగకూడదు. ఎందుకంటే మామిడిపండ్లలో సహజ చక్కెర ఉంటుంది. ఇక జ్యూస్ గా చేసుకున్నప్పుడు అందులో మరింత చక్కెరను కలుపుతారు. ఇది మధుమేహం బాధితులకు తీవ్ర అనారోగ్యానికి కారణమవుతుంది. మ్యాంగో జ్యూస్ తాగితే ఈ సమస్యలు ఇబ్బంది పెడతాయి చాలామంది బరువు తగ్గాలి అనుకునేవారు మ్యాంగో జ్యూస్ తాగకుండా ఉంటేనే మంచిది. మ్యాంగో జ్యూస్ లో అధిక క్యాలరీలు ఉండడం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి బరువు తగ్గాలని భావించేవారు మ్యాంగో జ్యూస్ తాగకూడదు. ఇదే సమయంలో ఎవరైతే జీర్ణ సంబంధమైన సమస్యలతో బాధపడుతున్నారో వారు మ్యాంగో జ్యూస్ తాగకుండా ఉంటేనే మంచిది. ఎసిడిటీ, గ్యాస్ సమస్యలతో బాధపడేవారు మ్యాంగో జ్యూస్ తీసుకోవద్దు. ఈ వ్యాధులు ఉన్నవారికి మ్యాంగో జ్యూస్ మంచిది కాదు కాలేయ సంబంధిత సమస్యల విషయంలో కూడా మ్యాంగో జ్యూస్ తాగకుండా ఉంటేనే మంచిది. కొంతమందికి మామిడిపండ్ల అలర్జీ ఉంటుంది. ఇక వారు కూడా మామిడి పండు జ్యూస్ జోలికి పోకుండా ఉంటే మంచిది. అటువంటి వారు కూడా మామిడిపండ్ల జ్యూస్ తాగితే అలర్జీలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి వారు కూడా తాగకుండా ఉంటేనే మంచిది.



# స్పోర్ట్స్ న్యూస్

## మాకు ఆ అవకాశాలు వచ్చినా విఫలమయ్యాం: రుతురాజ్



ఐదుసార్లు ఐపీఎల్ విజేతగా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ 2026లో మాత్రం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. లీగ్ దశలో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ, పునరాగమనం చేసి ప్లేఆఫ్స్ ఆశలు రేకెత్తించిన రుతురాజ్ గైక్వాడ్ సేన.. కీలకమైన ఆఖరి మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ (ఉ) చేతిలో ఘోర పరాజయాన్ని చవిచూసింది. గురువారం జరిగిన ఈ నిర్ణయాత్మక పోరులో 230 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై.. కేవలం 13.4 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. 89 పరుగుల తేడాతో ఎదురైన ఈ ఓటమి ఐపీఎల్ చరిత్రలోనే సీఎస్కేకు అత్యంత భారీ పరాజయం కావడం గమనార్హం. వరుసగా ఆఖరి మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోవడంతో చెన్నై లీగ్ దశలోనే ఇంటిబాట పట్టింది.ఓటమి అనంతరం బ్రాడ్‌కాస్టర్‌తో చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మాట్లాడుతూ తవు వైఫల్యాలను నిజాయితీగా అంగీకరించాడు. 'మొదటి మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన తర్వాత అద్భుతంగా కోలుకుని ఆరు మ్యాచ్‌లు గెలిచాం. అయితే కీలక సమయంలో గాయాల బారిన పడటం మా లయను దెబ్బతీసింది. రామకృష్ణ ఘోష్, జేమీ ఓవర్టన్ వంటి కీలక ఆటగాళ్లు దూరం కావడంతో జట్టు సమతుల్యత దెబ్బతింది. ఆఖరి మూడు మ్యాచ్‌ల్లో ఒక బ్యాటర్ లేదా బౌలర్ తక్కువతో ఆడాల్సి వచ్చింది. గుజరాత్‌తో మ్యాచ్‌లో పవర్‌ప్లేలో మా బౌలింగ్ బాగోలేదు. వారిని 200 పరుగుల లోపే కట్టడి చేసే అవకాశం ఉన్నా చేజార్చుకున్నాం' అని రుతురాజ్ వాపోయాడు.జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉందన్న రుతురాజ్.. అనుభవజ్ఞులైన అజింక్యా రహానే, అంబటి రాయుడు వంటి సీనియర్ల స్థానాల్లో కార్తీక్ శర్మ, ఉర్విల్ పటేల్, డెవాల్డ్ బ్రెవిస్ వంటి యువ ఆటగాళ్లకు అవకాశాలు ఇచ్చామన్నాడు. జట్టులోని ఎనిమిది మంది కంటే ఎక్కువ మంది ఆటగాళ్లకు 20 కంటే తక్కువ మ్యాచులు ఆడిన అనుభవమే ఉందని, ఈ సీజన్ ద్వారా జట్టులోని లోపాలను గుర్తించామని చెప్పాడు. హోమ్ గ్రౌండ్‌లో ఇబ్బంది పడ్డా.. విదేశీ మైదానాల్లో ఆరు విజయాలు సాధించడం గర్వంగా ఉందన్నాడు.మరోవైపు రుతురాజ్‌కు చెన్నై సూపర్ ప్లేయర్ మహేంద్ర సింగ్ ధోని భవిష్యత్ గురించి ప్రశ్న ఎదురైంది. అందుకు రుతురాజ్ బదులిస్తూ...'ఆ విషయం వచ్చే ఏడాది మీకూ, నాకూ కలిసే తెలుస్తుంది. ధోనీ ఆలోచనలు ఆయనకు మాత్రమే తెలుసు. అయితే మ్యాచ్ ఆఖరి ఓవర్లలో క్రీజులో ఉండి మ్యాచ్ స్వరూపాన్ని మార్చగల ధోనీ లేకపోవడం జట్టుకు పెద్ద లోటే' అంటూ గైక్వాడ్ ఆసక్తికరంగా సమాధానమిచ్చాడు. 19 సీజన్ల ఐపీఎల్ చరిత్రలో మహేంద్ర సింగ్ ధోనీ కనీసం ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడం ఇదే తొలిసారి.

## మా వాట్సాప్ గ్రూప్‌లోనూ వైభవ్ గురించే చర్చిస్తున్నాం: స్టువర్ట్ బ్రాడ్



యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు ఇప్పుడు ప్రపంచ క్రికెట్ వర్గాల్లో మార్మోగుతోంది. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున సంచలన ప్రదర్శనలతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. 15 ఏళ్ల వయసులోనే ఎన్నో రికార్డులు కొల్లగొడుతున్నాడు. ప్రత్యర్థి బౌలర్లపై వైభవ్ విరుచుకుపడుతున్న తీరు అభిమానులతో పాటు క్రికెట్ దిగ్గజాలను కూడా ఆశ్చర్యానికి గురి చేస్తోంది. తాజాగా ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ స్టువర్ట్ బ్రాడ్ కూడా వైభవ్ సూర్యవంశీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.'15 ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశీ అద్భుతాలు చేస్తున్నాడు. మా వాట్సాప్ గ్రూప్‌లో వైభవ్ చర్చే ప్రధాన అంశంగా మారింది. మైదానంలో అతడు ఆడటం మొదలుపెడితే.. మా గ్రూప్‌లో మెసేజ్‌లు వరదలా వస్తుంటాయి. 'మళ్లీ చెలరేగాడు.. 17 బంతుల్లో 43 పరుగులు..' అంటూ మెసేజ్‌లు చేస్తూ గ్రూప్‌లో ఉన్నవాళ్లంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తుంటారు. అతడి దూకుడుని బౌన్సర్, యార్కర్లతో చెక్ పెట్టొచ్చని భావించే లోపే.. మరో కొత్త షాట్‌తో అందరినీ షాక్‌కు గురి చేస్తాడు' అని స్టువర్ట్ బ్రాడ్ ఓ పాడ్‌కాస్ట్‌లో వెల్లడించాడు. ఇంగ్లండ్ క్రికెటర్ బట్లర్ కూడా వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురిపించాడు. 'పవర్ ప్లేలో ప్రతి రెండు బంతులకు ఒక బౌండరీ బాదుతున్నాడు. ఇది అసాధారణ ప్రతిభ' అంటూ కొనియాడాడు.ఇదిలా ఉంటే, వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 53 సిక్సర్లు బాది.. ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఇక క్రిస్ గేల్ పేరిట ఉన్న ఒకే సీజన్‌లో 59 సిక్సర్ల రికార్డుకు వైభవ్ అత్యంత చేరువలో ఉన్నాడు. అయితే ఐపీఎల్ 2026 ఆరెంజ్ క్యాప్ రేసులోనూ వైభవ్ దూసుకెళ్తున్నాడు. 13 మ్యాచుల్లో 579 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## చరిత్ర సృష్టించిన సాయి సుదర్శన్.. రెండవ భారత క్రికెటర్‌గా రికార్డ్..

ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌పై 89 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్ ఘన విజయం సాధించింది. ఇక ఈ మ్యాచ్‌లో గుజరాత్ స్టార్ ఓపెనర్ సాయి సుదర్శన్ అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకున్నాడు. సీఎస్కేతో మ్యాచ్‌లో 53 బంతుల్లో 84 పరుగులు చేశాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలోనే వరుసగా 5 అర్ధ సెంచరీలు నమోదు చేసిన రెండో భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఈ సీజన్‌లో మొత్తంగా ఏడు అర్ధ శతకాలు, ఒక శతకం సాధించాడు సాయి సుదర్శన్.ఐపీఎల్‌లో వరుసగా ఐదు హాఫ్ సెంచరీలు బాదిన జాబితాలో టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఐపీఎల్ 2012లో ఢిల్లీ డేర్ డేవిల్స్ తరఫున వీరేంద్ర సెహ్వాగ్ వరుసగా ఐదు అర్ధ సెంచరీలు సాధించాడు. ఆ తర్వాత జోస్ బట్లర్, డేవిడ్ వార్నర్ ఈ ఘనతను అందుకున్నారు.



2018లో రాజస్థాన్ రాయల్స్ తరఫున జోస్ బట్లర్, 2019లో సన్ రైజర్స్ హైదరాబాద్ తరఫున డేవిడ్ వార్నర్ వరుసగా 5 హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. గత ఏడేళ్లుగా ఈ ఫీట్ ఎవరూ అందుకోపోగా.. సాయి సుదర్శన్ తాజా సీజన్‌లో ఈ అరుదైన రికార్డును సాధించాడు.టీమిండియా దిగ్గజం, కింగ్ కోహ్లీకి కూడా ఈ ఘనత సాధ్యం కాలేదు. ఈ సీజన్‌లో సాయి సుదర్శన్ ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా కొనసాగుతున్నాడు. సాయి సుదర్శన్ పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్, కేకేఆర్‌లపై వరుసగా 57, 55, 61, 53× పరుగులు చేశాడు. గురువారం చెన్నై సూపర్ కింగ్స్ పై మరో అర్ధ సెంచరీ(84) చేయడంతో వరుసగా ఐద హాఫ్ సెంచరీలు చేసిన ప్లేయర్ల జాబితాలో స్థానం సంపాదించాడు. ఇక మొత్తంగా టీ20 క్రికెట్ చరిత్రలో వరుసగా అత్యధిక హాఫ్ సెంచరీలు బాదిన రికార్డ్ రియాన్ పరాగ్ పేరిట ఉంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అతను వరుసగా 7 అర్ధ సెంచరీలు నమోదు చేశాడు.

## ఆటగాళ్లను బూతులు తిట్టడం సరికాదు: అశ్విన్



ఐపీఎల్ 2026 లీగ్ చివర్లో వరుసగా 3 మ్యాచ్‌ల్లో ఓడిపోయి చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడం అభిమానులకు తీవ్ర నిరాశను మిగిల్చింది. టోర్నీ ఆరంభంలో అద్భుత విజయాలతో టాప్-4 రేసులో బలంగా కనిపించిన సీఎస్కే.. ముగింపు దశలో వరుస పరాజయాలతో టోర్నీ నుంచి వైదొలిగింది. గురువారం గుజరాత్ టైటాన్స్ జట్టుతో జరిగిన డూ ఆర్ డై మ్యాచ్‌లో 89 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ భారీ ఓటమిని అభిమానులు అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌ను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా కొందరు ఫ్యాన్స్ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారురుతురాజ్ గైక్వాడ్‌పై జరుగుతున్న ఈ హేయమైన ట్రోలింగ్‌ను చూసి భారత సీనియర్ స్పిన్నర్, సీఎస్కే మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. రుతురాజ్‌కు మద్దతుగా నిలుస్తూ అభిమానులకు చిన్న హెచ్చరిక చేశాడు. రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ.. 'నేను ఎప్పుడూ చెబుతుంటాను, రుతురాజ్ చాలా మంచి ఆటగాడు. కొందరు వ్యక్తులు అతన్ని ఎందుకు అంత దారుణంగా విమర్శిస్తున్నారో నాకు అర్థం కావడం లేదు. రుతురాజ్ లాంటి ఆటగాడిపై ఇలాంటి విమర్శలు మంచిది కాదు. కెరీర్‌లో ఎవరికైనా ఎప్పుడైనా గడ్డు కాలం రావచ్చు. సమయం ఎప్పుడూ ఒకేలా ఉండదు. సమయం అందరికీ మారుతుంది. అంతమాత్రానికే ఒక ఆటగాడిని వ్యక్తిగతంగా దూషించడం, ట్రోల్ చేయడం సరైనది కాదు' అంటూ అశ్విన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.ఇక చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు ఈ స్టార్ స్పిన్నర్ అభిమానులకు ఓ కీలక విజ్ఞప్తి చేశాడు. ధోనీ సారథిగా ఉన్నప్పుడు జట్టుపై ఎలాంటి అంచనాలు పెట్టుకునేవారో.. ఇప్పుడు కూడా అలాంటివే ఆశించడం మానుకోవాలని సూచించాడు. ' గత 18 ఏళ్లుగా ధోనీ, సీఎస్కే కలిసి ప్రతిసారీ గెలవడం, ప్లేఆఫ్స్ చేరడం వంటి అలవాట్లను ఫ్యాన్స్‌కు నేర్పించారు. కానీ ఇప్పుడు ఐపీఎల్‌లో 10 జట్లు ఉన్నాయి. ప్రతి జట్టు అద్భుతంగా ఆడుతోంది. ఏ జట్టునైనా ఎవరైనా ఓడించగలరు. ఈసారి పాయింట్ల పట్టికలో తనకంటే కింద ఉన్న జట్లపై మాత్రమే సీఎస్కే గెలిచింది. కాబట్టి వారు భవిష్యత్తులో మరింత కష్టపడాలి. అలానే ఈసారి చెన్నై మంచి ప్రదర్శన చేయలేదనే విషయాన్ని అందరూ గ్రహించాలి' అని రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు.

## ఫిట్ నెస్ ఉన్నంత వరకు రోహిత్, కోహ్లీ ఆడాలి : కిరణ్ మోరే

హైదరాబాద్ : ఇండియన్ క్రికెట్ లెజెండ్స్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తమ ఫామ్, ఫిట్‌నెస్ నిలబెట్టుకున్నంత కాలం అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడాలని మాజీ భారత మాజీ క్రికెటర్, చీఫ్ సెలెక్టర్ కిరణ్ మోర్ ఆకాంక్షించారు. వారిద్దరిని బలవంతంగా రిటైర్ చేయించే ఆలోచన సరైంది కాదన్నారు. పరుగులు చేస్తున్నంత కాలం వారిని




కొనసాగించడం ఉత్తమం అని పేర్కొన్నారు. గాజియాబాద్‌లో జరుగుతున్న 'బియాండ్ రీచ్ ప్రీమియర్ లీగ్' ట్రయల్స్ సందర్భంగా కిరణ్ మోరే మీడియాతో మాట్లాడారు. రోకోకు ఇప్పటికి విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని గుర్తు చేశారు. వీరిద్దరూ కలసి ఆడటం చూడటానికి ఎంతో బాగుంటుందని చెప్పారు. అతిబిఎ ఢ ఒనీఇజీశ్రీ ఉబీతిటవబవీరి రిటైర్మెంట్ పై ఎలాంటి చర్చలు చేయొద్దని సూచించారు. సచిన్ పదవీ విరమణ చేసినప్పుడు నా కళ్లలో నీళ్లు వచ్చాయి. ఈ ఇద్దరూ ఆట నుండి వైదొలిగినప్పుడు కూడా,వారి లోటు తీవ్రంగా బాధిస్తుందన్నారు. ఆ సమయం వచ్చినప్పుడు రిటైర్మెంట్ నిర్ణయాన్ని తీసుకొనే సమర్థత వారికుందన్నారు. భవిష్యత్‌లో వైభవ్ సూర్యవంశీతో భారత్ గొప్ప కీర్తి లభిస్తుందన్నారు.కాగా, 311 వన్డే మ్యాచ్‌లలోవిరాట్ 299 ఇన్నింగ్స్‌లలో 58.71 సగటుతో 14,797 పరుగులు సాధించాడు. ఇందులో 54 శతకాలు, 77 అర్ధశతకాలు ఉన్నాయి, అలాగే అతని అత్యధిక స్కోరు 183. గతేడాది13 వన్డేలలో 65.10 సగటుతో 651 పరుగులు సాధించి, మూడు శతకాలు, నాలుగు అర్ధశతకాలు నమోదు చేశాడు. 2026లో, అతను మూడు ఇన్నింగ్స్‌లలో 80.00 సగటుతో, 105కి పైగా స్ట్రైక్ రేట్‌తో 240 పరుగులు చేశాడు.మరోవైపు ఐపీఎల్‌లో కోహ్లీ తన ఆటతీరును అద్భుతమైన స్థాయికి మెరుగుపరుచుకుంటూనే ఉన్నాడు. ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరుకున్న ఖీఅః తరపున ఆడుతూ 13 ఇన్నింగ్స్‌లలో 54.20 సగటుతో మొత్తం 542 పరుగులు సాధించాడు. ఒక సెంచరీ, నాలుగు హాఫ్ సెంచరీలతో పాటు తన కెరీర్‌లోనే అత్యధికమైన 164.74 స్ట్రైక్ రేట్‌ను నమోదు చేసి, 'ఆరెంజ్ క్యాప్' రేసులో కొనసాగుతున్నాడు. రోహిత్ 282 వన్డేలలో 274 ఇన్నింగ్స్‌లలో 48.84 సగటుతో మొత్తం 11,577 పరుగులు సాధించాడు. ఇందులో 33 శతకాలు, 61 అర్ధశతకాలు ఉన్నాయి. 264 అత్యధిక వ్యక్తిగత స్కోర్.

## పాకిస్థాన్ హాకీ ఆటగాళ్లకు ఆర్థిక కష్టాలు.. రోజువారీ అలవెన్సుల్లో భారీ కోత

పాకిస్థాన్ హాకీ జట్టు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్.. ప్లేయర్లకు నిధులు సమకూర్చకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే పెండింగ్ బకాయిల కోసం ఎదురుచూస్తోన్న వేళ.. పాక్ హాకీ ప్లేయర్లకు మరో షాక్ తగిలింది. హాకీ ప్రపంచ కప్ 2026 సమీపిస్తోన్న నేపథ్యంలో శిక్షణ శిబిరం రోజువారీ భత్యాన్ని భారీగా తగ్గించడం వివాదాస్పదంగా మారింది.పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్(పీహెచ్‌ఎఫ్) ప్రాక్టీస్ సమయంలో ఆటగాళ్లకు ఇచ్చే రోజువారీ భత్యాన్ని 3000 పాకిస్థాన్ రూపాయిల నుంచి 1000 పాకిస్థాన్ రూపాయిలకు తగ్గించింది. భారత కరెన్సీలో 1000 పాకిస్థాన్ రూపాయిల విలువ రూ.335 మాత్రమే. ఈ నిర్ణయంపై ప్లేయర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇది తమకు ఘోర అవమానంగా భావిస్తున్నారు. అంతర్జాతీయ పర్యటన సమయంలో పాక్ ప్లేయర్లకు, సిబ్బందికి రోజుకు 110 డాలర్లు చెల్లిస్తామని పీహెచ్‌ఎఫ్ ప్రకటించింది. అయితే గతంలో ఇచ్చిన హామీలే అమలు కాలేదని, తమకు రావాల్సిన బకాయిలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయంటూ ప్లేయర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'గతంలో కూడా ఇలాంటి హామీలు



ఇచ్చారు. కానీ అమలు చేయలేదు. ఇప్పుడు నిజంగా ఇస్తారో? లేదో? తెలియదు. మాకు ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చిన తర్వాతే పాక్ హాకీ ఫెడరేషన్‌ను నమ్ముతాం' అని ఓ ప్లేయర్లు పేర్కొన్నట్లు సమాచారం.ఇదిలా ఉంటే, ఆగస్టు 15 నుంచి హాకీ ప్రపంచ కప్ 2026 ప్రారంభం కానుంది. దీంట్లో భాగంగా జూన్ 13 నుంచి 27 వరకు హాకీ ప్రో లీగ్ పోటీలు జరగనున్నాయి. ఇందులో పాకిస్థాన్.. బెల్జియం, స్పెయిన్, ఇంగ్లండ్, భారత్‌తో తలపడనుంది. అనంతరం ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొననుంది. అయితే దేశానికి ట్రోఫీని అందించేందుకు శ్రమించాల్సిన ప్లేయర్లు.. ఆర్థిక ఇబ్బందులపై పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.




# మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం

## క్లాప్ కొట్టిన తమ్ముడు పవన్ కళ్యాణ్



మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం గురువారం మొదలైంది. కె.ఎస్.రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై కె. నారాయణ నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ క్లాప్ కొట్టారు. చిరంజీవి కుమార్తె సుస్మిత కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు వి.వి.వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసక్తికర విషయాలు చోటు చేసుకున్నాయి. అన్నపూర్ణ స్టూడియోకు చిరంజీవి, తన సోదరుడు పవన్‌కల్యాణ్ ఒకే కారులో వచ్చారు. తదుపరి నాగబాబు జాయిన్ అయ్యారు. ముగ్గురు కలిసి ఒకే సోఫాలో కూర్చుని చక్కగా ముచ్చటించుకున్నారు. చిరంజీవి పక్కన ఉన్నంత సేపు పవన్ ఎంతో వినయంగా ఉన్నారు. ఈ దృశ్యాన్ని చూసి అభిమానులు సంబరపడిపోయారు. చాలాకాలం తర్వాత ముగ్గురు సోదరులను ఒకే వేదికపై చూడటం కనుల విందుగా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలాగే చిరంజీవి, పవన్‌కల్యాణ్, రామ్‌చరణ్ ఫొటోలను చిత్రించిన పట్టు శాలువాతో చిరంజీవిని సన్మానించింది చిత్ర బృందం. మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. పవన్‌కల్యాణ్‌కి భక్తుడైన బండ్ల గణేశ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బండ్లను చూడగానే పవన్ దగ్గరకు తీసుకుని భుజంపై చేయి వేసి మాట్లాడుతూ లోపలికి తీసుకెళ్లారు. ఆ కాసేపు బండ్ల మొహం హై వోల్టేజ్ బల్బ్‌లా వెలిగిపోయింది. ఎప్పటిలాగే వినయంగా చేతులు కట్టుకుని మాట్లాడారు బండ్ల గణేశ్. చిరంజీవి సైతం బండ్లను హత్తుకున్నారు. అభిమానులు మాత్రం 'బండ్లన్నకు ఇవాళ పండగే.. ఆయన అభిమానించే హీరోలతో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఈ రోజు ఆయనకు నిద్ర పట్టదేమో' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి అనశ్వర రాజన్ కూడా హాజరయ్యారు. ఈ చిత్రంలో ఆమె చిరుకు కుమార్తెగా కనిపించనున్నట్లు టాక్ నడుస్తోంది.



# చిరుకు కూతురుగా అనస్వర



చిత్రపరిశ్రమలో ఎప్పుడు ఎవరిని అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. కొంతమందికివరుస విజయాలు అందుకున్నా కొన్నిసార్లు ఛాన్స్ లు రావు. మరికొంతమందికి ఒక్క సినిమా చేసినా మెగా ఛాన్స్ వచ్చేస్తోంది. తాజాగా మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ రెండో కేటగిరిలో ఉందని చెప్పొచ్చు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ కెరీర్ ను ప్రారంభించిన ఈ బ్యూటీ ప్రస్తుతం స్టార్ హీరోయిన్ గా కొనసాగుతోంది.ఛాంపియన్ సినిమాతో అనస్వర తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి మిక్స్డ్ టాక్ ను అందుకుంది. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా అనస్వర న్యాచురల్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అమ్మడికి టాలీవుడ్ లో మంచి భవిష్యత్ ఉంటుందని జోస్యం కూడా చెప్పారు. ఇప్పుడు ఆ జోస్యం నిజమైంది. ఈ చిన్నది తన రెండో సినిమానే మెగాస్టార్ చిరంజీవితో చేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి– బాబీ కొల్లి కాంబోలో వస్తోన్న చిత్రం మెగా 158. కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రం తాజాగా పూజా కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. ఈ ప్రారంభోత్సవంలో పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం విశేషం. చిరంజీవిపై చిత్రీకరించిన ప్రారంభ సన్నివేశానికి పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టారు. ఇక ఈ చిత్రంలో అనస్వర ఒక కీలక పాత్రలో నటించబోతోంది. చిరుకు కూతురిగా ఆమె నటిస్తోందని తెలుస్తోంది. మెగాస్టార్ సినిమాలో ఒక చిన్న పాత్ర చేసినా అది ఈ తరం నటీనటులకు అచీవ్ మెంట్ అని చెప్పొచ్చు. ఎన్నోఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్లకు రాని మెగా ఛాన్స్ రెండో సినిమాకే ఈ మలయాళ బ్యూటీకి దక్కడం నిజంగా ఆమె అదృష్టమని నెటిజన్స్ అంటున్నారు. ఏది ఏమైనా అనస్వర నక్కతోక తొక్కింది అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.




# బాబీ డియోల్ బందర్ మూవీ

బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డియోల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ బందర్ . 'యానిమల్' సినిమాతో గ్లోబల్ స్థాయిలో తన పవర్‌ఫుల్ నటనతో ఆకట్టుకున్న బాబీ డియోల్, మరోసారి అంతకు మించిన ఇంటెన్స్ రోల్‌లో ఈ చిత్రం ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ట్రైలర్ చూస్తుంటే.. బాబీ డియోల్ ఈ సినిమాలో ఓ రాక్ స్టార్‌గా, విలాసవంతమైన జీవితాన్ని గడిపే 'ప్లేబాయ్' పాత్రలో కనిపిస్తున్నాడని తెలుస్తుంది. అయితే, అంతా సాఫీగా సాగిపోతున్న సమయంలో అతను అనుకోకుండా జైలు పాలు కావాల్సి వస్తుంది. అసలు బాబీ జైలుకు ఎందుకు వెళ్ళాడు? అతనిపై కేసు పెట్టిన ఆ యువతి ఎవరు? అనే ఆసక్తికర అంశాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇక ఈ చిత్రంలో బాబీ డియోల్‌తో పాటు సన్యా మల్హోత్రా, సబా ఆజాద్ మరియు సప్నా పబ్బి కీలక పాత్రల్లో మెరుస్తున్నారు. ఈ సినిమాకు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహిస్తుండగా.. నిఖిల్ ద్వివేది మరియు అనురాగ్ కశ్యప్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అన్ని హంగులతో, హై వోల్టేజ్ డ్రామాతో రూపొందుతున్న ఈ చిత్రం 2026, జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. బాబీ డియోల్ కొత్త మేకోవర్ చూస్తుంటే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది.




# డ్రాగన్‌కు 64 మిలియన్ల వ్యూస్

పొరపాటున కూడా నా కలలోకి రావొద్దు' అంటూ రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్. ఆయన ప్రధాన పాత్రలో ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డ్రాగన్' తారక్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి మొదటి అప్‌డేట్‌గా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 4 నిమిషాలు ఉన్న ఈ వీడియో సోషల్ మీడియాను షేక్ చేసింది. ఇప్పుడు రికార్డును కూడా నమోదు చేసింది. 24 గంటల్లో 'డ్రాగన్' గ్లింప్స్ 64 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకున్నట్లు టీమ్ తెలిపింది.







కేవలం ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులో మరిన్ని రికార్డులు రావడం ఖాయమంటూ ఫ్యాన్స్ భావిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన గ్లింప్స్‌లో ఎన్టీఆర్ 'డ్రాగన్'గా రక్తపాతం సృష్టించే శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. విజువల్స్ ప్రత్యేకమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరించాయి. 'కె.జి.ఎఫ్' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించిన దర్శకుడు ప్రశాంత్‌నీల్ 'సలార్' తర్వాత తెరకెక్కిస్తున్న సినిమా ఇది.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printe d at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**